మెట్రో రైలుకు గ్రీన్‌సిగ్నల్



- తొలి దశకు రాష్ట్ర ప్రభుత్వం ఓకే
- డీపీఆర్‌కు ఆమోదం
- మూడు కారిడార్లు... 46.23 కి.మీ.
- రూ.11,498 కోట్ల వ్యయం
- రెండో దశలో 30.67 కి.మీ., రూ.5,734 కోట్లు
- నిర్మాణ వ్యయం పూర్తిగా భరించాలని కేంద్రానికి వినతి

-8లో

గంజాయి నియంత్రణకు బహుముఖ వ్యూహం

- సాగు, రవాణా, వినియోగంపై మరింత నిఘా
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం
- కాఫీ, సిల్వర్ ఓక్, అవకాడో, డ్రాగన్, మామిడి, సీతాఫలం మొక్కలు పంపిణీ
- ఈ ఏడాది 45 ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నట్టు డ్రోన్ల ద్వారా గుర్తింపు
- కొత్తగా 23 చెక్‌పోస్టులు ఏర్పాటు, 350 మొబైల్ చెక్‌పోస్టులు
- 166 కేసులు నమోదు, 476 మంది అరెస్టు, 12,000 కిలోలు స్వాధీనం
- గంజాయితే దొరికితే వాహనాలు, ఆస్తులు సీజ్
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా, అమ్మకాలు, వినియోగం వంటి వాటిని అరికట్టడానికి బహుముఖ వ్యూహం అమలు చేస్తున్నామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ తెలిపారు. గంజాయిని నిర్మూలించేందుకు అనుసరిస్తున్న విధానాలు ఇప్పటికే కొంత సత్ఫలితాలు ఇచ్చాయని, అయితే వ్యవస్థీకృతంగా ఏళ్ల తరబడి చేస్తున్న సాగు, అమ్మకాలు, రవాణాపై మరింత నిఘా పెట్టామన్నారు. సోమవారం తనను కలిసిన విలేకరులకు గంజాయి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను డీఐజీ వివరించారు.



మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ

గంజాయి నియంత్రణకు తాను బాధ్యతలు చేపట్టిన తరువాత పలు రకాల ప్రణాళికలు అమలు చేసినట్టు డీఐజీ గోపీనాథ్ చెప్పారు. గడచిన మూడు, నాలుగు సంవత్సరాల్లో గంజాయి సాగు చేసిన గ్రామాల వివరాలను తీసుకున్నామన్నారు. మొత్తం 195 గ్రామాల్లో గతంలో గంజాయి సాగు చేశారని, వాటిలో 125 గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయడంతోపాటు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 215 గ్రామాల్లో 10,700 మంది రైతులకు చెందిన 10,837 ఎకరాల్లో గంజాయికి ప్రత్యామ్నాయంగా సాగు చేసుకునేందుకు కాఫీ, సిల్వర్ ఓక్, అవకాడో, డ్రాగన్, మామిడి, సీతాఫలం, నేరేడు, సపోట తదితర 22 రకాల పండ్లు, ఇతర రకాల మొక్కలు పంపిణీ చేశామన్నారు. మరో 30 వేల మంది రైతులకు 4,500 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశామని, ఇంకా పసుపు పంటను ప్రోత్సహించామన్నారు. అయినప్పటికీ గంజాయి సాగు చేసే అవకాశం ఉన్న గ్రామాల్లో సచివాలయం, ఫారెస్టు, రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటుచేసిన బృందాలను సర్వే చేయించామన్నారు. సర్వే బృందాలు, కూంబింగ్ పార్టీలు ఇచ్చిన సమాచారం మేరకు 198 గ్రామాల్లో డ్రోన్‌ల సాయంతో 7,358 ఎకరాల్లో సర్వే చేయిస్తే జి.మాడుగుల, పెదబయలు మండలాల్లోని 41 గ్రామాల్లో 45 ఎకరాల్లో గంజాయి సాగు చేసినట్టు తేలిందన్నారు. ఆ పంటను ధ్వంసం చేశామన్నారు. మరికొన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వే చేస్తున్నామని పేర్కొన్నారు. అయితే మారుమూల కొండవాలు ప్రాంతాల్లో కొంతమేర గంజాయి సాగుచేసే అవకాశం ఉందని అభిప్రాయపడుతూ, వీటిని గుర్తించేందుకు కూంబింగ్ పార్టీలు యత్నిస్తున్నాయన్నారు.

ఏజెన్సీ నుంచి గంజాయి రవాణాను అరికట్టేందుకు అనేక రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకూ ఉన్న 13 చెక్‌పోస్టులకు అదనంగా 23 చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామని డీఐజీ గోపీనాథ్ వెల్లడించారు. ఒక్కొక్క చెక్‌పోస్టులో మూడు షిఫ్టులలో నలుగురేసి సిబ్బంది విధులు నిర్వహిస్తారని వివరించారు. 11 చెక్‌పోస్టుల వద్ద డాగ్ స్క్వాడ్‌లు ఏర్పాటుచేశామన్నారు. వీటికితోడు 350 మొబైల్ చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయన్నారు. చెక్‌పోస్టుల ద్వారా 166 కేసులు నమోదుచేసి, 476 మందిని అరెస్టు చేసి వారి నుంచి 12 వేల కిలోల గంజాయిని

... మిగతా 8వ పేజీలో

169.39 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు, రెండు వాహనాలు సీజ్

సబ్బవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి మండలం మీదుగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తుల్లో ముగ్గురిని గొటివాడ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 169.39 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరు, బైక్, మూడు సెల్ ఫోన్లు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సోమవారం మీడియాకు తెలిపిన వివరాలిలా వున్నాయి.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నల్సార్ (న్యాయ విశ్వవిద్యాలయం) జంక్షన్ వద్ద ఎస్ఐ పి.సింహాచలం, పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ



పట్టుకున్న గంజాయి, నిందితులతో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రమణ, ఎస్ఐలు, సిబ్బంది

క్రమంలో చోడవరం వైపు నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపి విచారిస్తున్నారు. ఇదే సమయంలో బైక్ వెనుక

... మిగతా 8వ పేజీలో

సమగ్రాభివృద్ధికి బాటలు

జిల్లాలో 1,427 రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులు రూ.127.93 కోట్లు మంజూరు
- చురుగ్గా సాగుతున్న సీసీ, తారు రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం
- ఇప్పటికే 456 పనులు పూర్తి
- ఈ నెలాఖరునాటికి పూర్తిచేయాలని లక్ష్యం



ఎలమంచిలి మండలం పేకేరుపాలెంలో కొత్తగా నిర్మించిన రోడ్డు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి బాటలు పడుతున్నాయి. గ్రామీణ రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడమే కాకుండా పనులు వేగంగా జరిపిస్తున్నది. దీంతో మరో నెల రోజుల్లో గ్రామీణ రహదారుల రూపురేఖలు మారనున్నాయి.

ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన వైసీసీ నేతలు గ్రామీణ రోడ్ల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. రహదారులు ఎక్కడికక్కడ ఛిద్రమై కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారడంతోపాటు గోతుల్లో నీరు చేరి పంట కుంటలను తలపించేవి. అధ్వాన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు అష్టకష్టాలు పడేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ రహదారులను బాగు చేయాలని నిర్ణయించింది. సంక్రాంతి పండుగనాటికి రోడ్లపై



కె.కోటపాడు మండలం చౌడువాడలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

ఒక్క గుంత కూడా కనిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. దీంతో జిల్లాలో అధ్వాన రోడ్లను గుర్తించి చకచకా పనులు చేయిస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్లపై గోతులను పూడ్చడంతోపాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో 1,427 రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.127.93 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.113.94 కోట్లతో 148 కిలోమీటర్ల పొడవున సిమెంట్ రోడ్లు, 12 కిలోమీటర్ల మేర 10 తారు రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇంకా గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు, పాత రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. జిల్లాలో ఇంతవరకు 1,036 పనులు ప్రారంభమయ్యాయని, వీటిలో 456 పనులు పూర్తి కాగా మిగిలిన పనులు చురుగ్గా సాగుతున్నాయని డ్వామా పీడీ పూర్ణిమదేవి తెలిపారు.

ఈ నెలాఖరుకు రోడ్ల పనులు పూర్తి

- వీరన్నాయుడు, పీఆర్ ఇంజనీరింగ్ అధికారి

జిల్లాలో ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో గ్రామాల్లో సిమెంట్, తారు రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిర్మాణ పనులు నామినేషన్ పద్ధతిపై స్థానికులతో చేయిస్తున్నాం. నిధుల కొరత లేదు. సంక్రాంతి నాటికి రోడ్లు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ అంతకన్నా ముందుగానే పనులు పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నాం.

ఆర్ఈసీఎస్‌పై నేతల కన్ను

ఈపీడీసీఎల్ నుంచి వెనక్కి తీసుకునేందుకు వ్యూహం

- వాస్తవాలు దాస్తున్న నాయకులు
- గతంలో నెలకు రూ.2 కోట్లలోపు లాభం చూపిన అధికారులు, నాయకులు
- మిగిలింది దుర్వినియోగం చేశారనే ఆరోపణలు
- తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోకి వచ్చిన తరువాత రూ.127.68 కోట్లు మిగులు
- ఖర్చులు పోను రూ.85.68 కోట్ల లాభం



ఈపీడీసీఎల్, ఆర్ఈసీఎస్ కార్యాలయాలు (ఫైల్ ఫొటోలు)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)ను మళ్లీ వెనక్కి తీసుకోవాలని కొందరు ప్రజా ప్రతినిధులు యత్నిస్తున్నారు. లాభాలు వస్తున్న సంస్థను లాగేసుకున్నారని తప్పుడు లెక్కలు చెబుతున్నారు. నష్టాల విషయాన్ని, నిధుల దుర్వినియోగాన్ని దాచి పెడుతున్నారు.

ఆర్ఈసీఎస్ సహకార సంస్థలో ఉన్నప్పుడు భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఏటా ఆర్ఈసీఎస్‌లు ప్రభుత్వ సిఫారసుతో లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి. కానీ అనకాపల్లి ఆర్ఈసీఎస్ ఆ నిబంధన ఉల్లంఘించింది. సిఫారసు లేకుండానే రెన్యువల్‌కు దరఖాస్తు చేసింది. ఈ విషయాన్ని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీఎస్) గుర్తించి అభ్యంతరం వ్యక్తంచేసింది. యూనిట్ విద్యుత్ రూ.1.40కు తీసుకొని, సగటున రూ.5కి విక్రయిస్తున్నారని, ఆ రాయితీ (మిగులు) మొత్తం ఏమి చేస్తున్నారని నిలదీసింది. సమాధానం చెప్పలేక అప్పటి ఆర్ఈసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ చేతులెత్తేశారు. దాంతో ఆర్ఈసీఎస్‌ను ఏపీ తూర్పు విద్యుత్ ప్రాంత పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) నిర్వహించాలని, ఆ తరువాత విలీనం చేసుకోవాలని ఆదేశించింది. దీంతో ఆర్ఈసీఎస్ 2021 సెప్టెంబరులో ఈపీడీసీఎల్ స్వాధీనంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఎటువంటి సమస్యలు లేకుండా నడుస్తోంది.

ప్రజా ప్రతినిధులు ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాల ప్రకారం అనకాపల్లి ఆర్ఈసీఎస్‌కు 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.1.83 కోట్లు, 2020-21లో రూ.1.91 కోట్ల లాభం వచ్చింది. అయితే 2018-19లో రూ.1.74 కోట్ల నష్టం వచ్చింది. ఈ విషయాన్ని

... మిగతా 8వ పేజీలో

ముసురుతో గుబులు

- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడి
- ఆందోళన చెందుతున్న వరి రైతులు



ఈదురు గాలులుతో మునగపాకలో నేలవాలిన వరిపైరు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ తీరందాటి అల్పపీడనంగా బలహీనపడగా.. దాని ప్రభావంతో జిల్లాలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు అడపాదడపా తేలికపాటి జల్లులు పడుతూనే ఉన్నాయి. ముసురు వాతావరణం నెలకొని పాటు మోస్తరు వర్షం కురుస్తుండడంతో వరి రైతులు కలవరం చెందుతున్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో దాదాపు వారం రోజుల నుంచి రైతులు వరి కోతలు కోయడం లేదు. మరోవైపు రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురుస్తాయని, అందువల్ల వరి కోతలు మొదలు పెట్టవద్దని అధికారులు సూచిస్తున్నారు. దీంతో గింజ రాలిపోతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా వుండగా ఈదురు గాలులు వీచడంతో సాంబ మసూరి వంటి ఎక్కువ ఎత్తు పెరిగే రకాలు వేసిన పొలాల్లో వరి పైరు నేలవాలింది. దీంతో రైతులు కూలీలను ఏర్పాటు చేసుకుని, వరి దుబ్బులను నిలబెట్టుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. లోతట్టు ప్రాంతాల్లోని భూముల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపుతున్నారు. మంగవారం పూర్తిగా ఎండకాసి, ఆకాశం మేఘావృతం కాకుండా వుంటే బుధవారం నుంచి వరి కోతలు మొదలుపెట్ట వచ్చుని అధికారుల సూచిస్తున్నారు.

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

- బోడిగరువులో గర్భిణికి పురిటి నొప్పులు
- డోలీలో ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు
- ఐదు కి.మీ.లు నడుచుకుంటూ.. గెడ్డలు దాటుకుని దేవరాపల్లి రాక



గర్భిణిని డోలీలో మోసుకుంటూ సమ్మెద గెడ్డను దాటుతున్న గిరిజనులు

దేవరాపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు డోలీ మోతలు తప్ప డం లేదు. పురిటి నొప్పులు వచ్చిన గర్భిణులను, అస్వస్థతకు గురైన బాలింతలను, దీర్ఘకాలిక వ్యాధులబారిన పడి నడవలేనిస్థితిలో వున్న వారిని ఆస్పత్రికి తరలించాలంటే డోలీ కట్టాల్సిందే. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమకు మాత్రం రహదారి కష్టాలు తీరడంలేదని గిరిజనులు వాపోతున్నారు. మండలంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆనుకుని వున్న గ్రామాల్లో డోలీ మోతలు సర్వసాధారణంగా మారాయి. తాజాగా బోడిగరువు గ్రామానికి చెందిన ఓ నిండు గర్భిణిని డోలీలో మోసుకుంటూ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువు గ్రామానికి చెందిన సాహు శ్రావణికి ఆదివారం రాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతోపాటు తుఫాన్ కారణంగా వర్షం కురుస్తుండడంతో మండల

... మిగతా 8వ పేజీలో

పాడి రైతుల నిరసన



విశాఖ డెయిరీ ఎండీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పాడి రైతులు

- విశాఖ డెయిరీ ఎదుట ఉద్రిక్తత
- పాల సేకరణ తగ్గింపుపై ఆందోళన
- యాజమాన్యం స్పందించకపోవడంతో గేట్లు తోసుకుంటూ లోనికి వెళ్లి ఎండీ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- సమస్యల పరిష్కారానికి ఎండీ హామీ

-వార్త 8వ పేజీలో

పేటలో రూ.కోటితో డ్రైన్లు

- మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- హోం మంత్రి వి.అనిత
- రూ.95 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

పాయకరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో మురుగునీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి కోటి రూపాయలతో డ్రైనేజీ కాలువలు నిర్మించనున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. స్థానిక రాజుగారిబీడులో జల్ జీవన్ మిషన్ పథకం నిధులు రూ.95 లక్షలతో ఏర్పాటుచేయనున్న 2.5 లక్షల లీటర్ల సామర్థ్యంగత వాటర్ ట్యాంను నిర్మాణ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుండడంతోపాటు గత ప్రభుత్వం వదిలివేసిన అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నామని తెలిపారు. ఇక్కడ వాటర్ ట్యాంకు నిర్మాణంతోపాటు ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు పూర్తయితే సుమారు 1,500 కుటుంబాలకు తాగునీటి సమస్య తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆనందరావు, ఎంపీడీఓ ఎ.ప్రకాశరావు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, కూటమి పార్టీల నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, బోడపాటి శివదత్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న హోం మంత్రి వి.అనిత

భక్తిశ్రద్ధలతో కనకమ్మకు పూజలు

▸ ప్రారంభించిన కొఠారు వంశీయులు


అమ్మవారికి పూజలు చేస్తున్న కొఠారు గోవింద దంపతులు

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాస పూజలను సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త కుటుంబీకులైన కొఠారు గోవిందరావు దంపతులు అమ్మవారికి తొలి పూజలు చేశారు. అమ్మవారు విశేష అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. మార్గశిర మాసం నెలరోజులుపాటు ఆలయంలో అమ్మవారికి నిత్యం పూజలు నిర్వహిస్తారు. సోమవారం తెల్లవారు జాము నుంచి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి జలాభిషేకం చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువకులు కొఠారు సాంబశివరావు, కొఠారు కొండబాబు, ఎం. సత్యనారాయణ, రాము, తదితరులంతా కలిసి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలి రోజు ప్రసాద వితరణ నిర్వహించారు.

టీడీపీలో చేరిన దిబ్బపాలెం వైసీపీ నేతలు


ప్రగడ నాగేశ్వరరావును సన్మానిస్తున్న సెజ్ కాలనీ కూటమి నాయకులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బపాలెం సెజ్ పునరావాస కాలనీలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన నాయకులు కర్రి కొండబాబు, నంబారు కొండబాబు, సర్వసిద్ధి అప్పలరాజు, గోవింద్ తదితరులు తమ అనుచరులతో టీడీపీలోకి చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీరుకొండ నర్సింగరావు, రాజాన విజయ్‌కుమార్, యాంద్ర అప్పలనాయుడు, అడిగర్ల దేముడు, కాళ్ల రాజబాబు, రుత్తల రాము, లాలం జగదీష్, నెక్కల కృష్ణ, లాలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్యాకేజీ ఇప్పించాలని వినతి

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురం, కొత్తపట్నం నేవీ నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీ ఇప్పించాలని సోమవారం తహసీల్దార్‌కు మత్స్యకార నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1.3 లక్షల ప్యాకేజీ కొత్తపట్నంలో 157 మందికి, వాడనర్సాపురంలో 150 మందికి ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయమై నేవీ ఎన్‌డీసీని అడుగ్గా మిగిలిన లబ్ధిదారుల పేర్లు వెరిఫికేషన్ చేయాలని తహసీల్దార్‌కు జాబితాను పంపించామని చెప్పారని, వెంటనే వెరిఫికేషన్ చేయించి జాబితాను పంపాలన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో మత్స్యకార నేతలు చెల్లూరి దేముడు, చోడిపిల్లి సత్యనారాయణ, కారే రాముడు, చోడిపిల్లి మంగరాజు, సూరాడ అప్పలరాజు, సూరాడ శ్రీను, రాంబాబు, కాశియ్య ఉన్నారు.

హరిపాలెం పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి

అచ్యుతాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని అనకాపల్లి జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారిణి డాక్టర్ లూసీకార్డిలియా అన్నారు. మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ, ఇరువాడ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆమె సందర్శించి పలు సూచనలిచ్చారు. రక్తహీనతతో ఎవరూ మృతి చెందకుండా వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. పీహెచ్‌సీలో ప్రతీ కాన్పు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు రామచంద్రరావు, జగదీశ్, జనార్దన్, వైద్యాధికారిణి మానస, సిబ్బంది శ్రీనివాస్, రామలక్ష్మి, సునీత,ఉమామహేష్ పాల్గొన్నారు.

పద్య పఠనం విజేతలకు అభినందనలు

నక్కపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్‌లో ఆన్‌లైన్ పద్య పఠనం పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఇద్దరు బాలికలను సోమవారం పాఠశాల హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ అభినందించారు. ఇటీవల ప్రముఖ కవి తోపెల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 'అనంతచ్ఛందం' సంస్థ ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయిలో పద్యపఠనం పోటీలు నిర్వహించింది. ఈ పాఠశాల తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులు నేతృత్వంలో శిక్షణ పొందిన బాలికలు కోటబోయిన మేఘన, ఈగల హేమశ్రీ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు సంస్థ తరఫున ప్రశంసాపత్రం, నగదు పురస్కారాన్ని హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫల్గుణరావు, కుమారి, చిన్నారావు, రమేశ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'


బాధితులతో మాట్లాడుతున్న ఐడీఎస్‌పీ బృంద సభ్యులు

ఎస్.రాయవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు తమ ఆరోగ్యంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఎన్. మల్లేశ్వరి అన్నారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామాన్ని సోమవారం రాష్ట్ర ఐడీఎస్‌పీ బృందం సందర్శించింది. ఇటీవల గ్రామానికి చెందిన అడపా లోవ కుటుంబ సభ్యులు ఐదుగురు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. వారి పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉన్నది వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్ మల్లేశ్వరితోపాటు ఐడీఎస్‌పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ హెచ్. వెంకటేశ్వర్లు ఆరా తీశారు. ఆరోజు తిన్న ఉప్మా కలుషితం కావడానికి గల కారణాలను అడపా లోవను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేలెన్స్ ఆఫీసర్ డి. వినోద్‌కుమార్, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రాజేశ్వరి, జిల్లా ఎపిడెమిక్ సెల్ ఎంపీహెచ్‌ఈవో సన్యాసిరావు, మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో జంతువుల స్వైరవిహారం

▸ విచ్చలవిడిగా సంచరిస్తున్న వానరాలు, కుక్కలు, పందులు
▸ చిన్నారులు, విద్యార్థులు, మహిళలపై కోతులు, కుక్కల దాడి
▸ తీవ్ర అసహనానికి గురవుతున్న పట్టణ ప్రజలు
▸ పట్టించుకోని మునిసిపల్ పాలకులు, అధికారులు

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ అయిన ఎలమంచిలి పట్టణం జంతువులకు నిలయంగా మారింది. పట్టణంలో గుంపులు గుంపులుగా వానరాలు.. అందుకు తగ్గ రీతిలో గ్రామసింహాలు.. ఆపై పందుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

ఎలమంచిలి మునిసిపాలిటీ ఏడు గ్రామ పంచాయతీలను కలిపి 25 వార్డులతో ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీగా ఏర్పడి పదేళ్లు అయినా మౌలిక సమస్యలతోనే పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు. పాలకులు, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. సుమారు 50 వేల పైబడి జనాభాతో ఉన్న ఎలమంచిలిలో తాగునీరు, డ్రైనేజీలు కన్నా ప్రధానంగా కోతులు, కుక్కలు, పందుల సమస్య వేధిస్తోంది. కొన్నేళ్లుగా ఎలమంచిలిలో వానర మూక దాడులకు దిగుతుండడంతో అనేక మంది వీటి బారిన పడి గాయాలుపాలవుతున్నారు. ప్రధానంగా మిలట్రీ కాలనీ, ఏఎస్ఆర్. కాలనీ, కొత్తపేట, ధర్మవరం, యర్రవరం, నాగేంద్ర కాలనీ, రామ్‌నగర్ ప్రాంతాలలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో కోతులు గుంపులుగా సంచరిస్తూ పిల్లలు, విద్యార్థులు, మహిళలపై


పరమేశ్వరి థియేటర్ రోడ్డుపై సంచరిస్తున్న పందులు


మిలట్రీ కాలనీలో రోడ్డుపై ఉన్న వానరాలు, కుక్కలు గుంపులు(ఫైల్)

దాడులకు దిగుతున్నాయి. చివరకు పాఠశాలలకు చిన్నారులను పంపించాలంటే కోతులు కారణంగా తల్లిదండ్రులు భయపడుతున్నారు. కోతులు ఇళ్లలోకి ప్రవేశించి తినుబండారాలు, వస్తు సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయి. ఎదిరించిన వారిపై దాడులకు దిగుతుండడంతో ఏమీ చేయలేకపోతన్నారు. వీటిని ప్రత్యేక బృందాలతో పట్టించి అటవీప్రాంతాలకు తరలించాలని పట్టణ ప్రజలు ఏళ్ల తరబడి కోరుతున్నా పాలకుల్లో కానీ, అధికారుల్లో కానీ స్పందన ఉండడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇటీవల కాలంలో తీవ్రంగా మారిన కుక్కల సమస్యతో ప్రజలు రాత్రి వేళల్లో రోడ్లపై రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. గ్రామ సింహాలు సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో వీధిలో లెక్కకు మించిన సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. చీకటి పడితే చాలు ద్విచక్ర వాహనాలు వెంట పడుతూ పరుగులు పెట్టిస్తున్నాయి. ఇటీవల కాలంలో మునిసిపల్ వార్డుల్లో పాడి పశువులు, ఆవులను సైతం గాయపరుస్తున్నాయి. అత్తిలివారి చేలు, రామారాయుడుపాలెం వార్డులో కుక్కలు బారిన పడి ఆవులు ఆస్పత్రి పాలయ్యాయి. ప్రధాన రోడ్డు వెంబడే కాకుండా ప్రతి వీధిలో వీటి తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. అలాగే పట్టణ ప్రజలకు మరోసారి పందుల సమస్య తెర మీదకు వచ్చింది. ఇటీవల పందుల సంఖ్య కూడా పెరిగిపోవడంతో వీధులు, నివాస గృహాల వద్ద విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వీటి కారణంగా ఎక్కడ రోగాలు వ్యాప్తి చెందుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో వానరాలు, కుక్కలు, పందుల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే, మునిసిపల్ పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

లాలంకోడూరు కాలువలోకి ఫ్యాక్టరీల వ్యర్థ జలాలు

▸ ఆటుపోట్లు సమయంలో సముద్రంలో కలుస్తుందన్న మత్స్యకారులు

అచ్యుతాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సెజ్ కర్మాగారాల నుంచి వ్యర్థ జలాలను బయటకు వదిలేస్తుండడంతో కాలువలు కాలుష్యమయమవుతున్నాయి. సెజ్ కర్మాగారాల నుంచి విడుదలైన కాలుష్య జలాలు రాంబిల్లి మండలం లాలం కోడూరు కాలువలోకి వదిలేస్తుండడంతో నీరంతా నల్లగా మారిపోతోంది. ఈ నీరు నేరుగా పూడిమడక ఉప్పుటేరులో కలుస్తోంది. ఫలితంగా కాలువలో చేపలతోపాటు ఉప్పుటేరులో చేపలు కూడా చనిపోతున్నాయి. సముద్రంలో ఆటుపోట్లు కారణంగా ఉప్పుటేరులోని నీరు సముద్రంలో కలుస్తోంది. దీనివల్లే ఇటీవల ఎన్నడూ లేనివిధంగా పూడిమడక తీరంలో తాబేళ్లతోపాటు చేపలు కూడా చనిపోయి తీరానికి కొట్టుకువచ్చాయని మత్స్యకార నాయకుడు చేపల తాతలు తెలిపారు. గత నెలలో ఇక్కడ పరిస్థితిపై మత్స్యశాఖ అధికారులతోపాటు కాలుష్య నివారణ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు నీటిని, రెండు కర్మాగారాలను పరిశీలించారు. నీటి నమూనాలు సేకరించారు. పరీక్షలు అనంతరం కాలుష్య నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలుసుకొని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నెల రోజులు గడుస్తున్నా నీటి పరీక్షల నివేదికలు రాలేదు.. కానీ వ్యర్థ జలాలు రోజురోజుకి పెరిగిపోతోంది. అధికారులు పరీక్షలు నిర్వహించిన వారం రోజుల వరకు వ్యర్థ జలాలు కాలువల్లోకి విడిచి పెట్టలేదని, ఇప్పుడు విడిచిపెడుతున్నారని మత్స్యకార నాయకుడు చేపల తాతలు ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.


కాలువలో నీరు నల్లగా మారిన దృశ్యం


ఏపీఐఐసీ జడ్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

ఉప్పుటేరులో వ్యర్థాలపై ఆందోళన

అచ్యుతాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పూడిమడక ఉప్పుటేరులో రసాయన వ్యర్థాలను వదిలిన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. ఏపీఐఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఉప్పుటేరులో చనిపోయిన చేపలతో ఆందోళనకు దిగారు. ఆయా కంపెనీల నుంచి విడుదలైన రసాయన వ్యర్థాలతో లాలంకోడూరు,పూడిమడక, ఎస్ఈజెడ్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు ఏపీఐఐసీ జోనల్ మేనేజరు కె.హరిప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మత్స్యకార నేతలు చేపల తాతయ్య, రాజు, సన్యాసిరావు, నాయుడు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా పోలి పాడ్యమి

నక్కపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల రోజులపాటు నోములు, వ్రతాలు, పూజలు, ఉపవాసాలు చేపట్టిన భక్తులంతా సోమవారం ఉదయం పోలిపాడ్యమితో కార్తీకమాసం పూజలు విరమించారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే ఉపమాక స్వామివారి పుష్కరిణిలో మహిళలు పోలి పాడ్యమి దీపాలు వదిలి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అనంతరం ఉపమాక శివాలయం, గొడిచెర్ల శేషలింగేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు దర్శించుకున్నారు.


నక్కపల్లి: ఉపమాక పుష్కరిణి వద్ద పోలిపాడ్యమి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మునగపాకలో..

కార్తీకమాసం పూజలు చేసిన మహిళలు సోమవారం ఉదయం పోలిపాడ్యమి పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం వేకువజామున సంప్రదాయ దుస్తులు ధరించి సమీపంలో ఉన్న శివాలయాలు, స్నాన ఘట్టాల వద్ద అరటిదిప్పల్లో దీపాలు విడిచిపెట్టారు. అనంతరం శివాలయాలకు వెళ్లి దీపారాధనలు చేశారు. బ్రహ్మణలకు స్వయంపాకాలు అందజేసి, ఆశీస్సులు పొందారు.

రాంబిల్లిలో..

మండలంలోని పంచదార్లలో కార్తీక మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వేకువజాము నుంచి భక్తులు ఆకాశ గంగలో కార్తీక స్నానాలు ఆచరించారు. అనంతరం ఫణిగిరిపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అలాగే లాలం కోడూరు, దిమిలి, వెల్చూరు, కొత్తపట్నం గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.


మునగపాక: కాలువలో దీపాలు వదిలిన మహిళలు

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లో మహిళలంతా సోమవారం భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు నిర్వహించారు. వేకువజామునే మహిళలంతా పూజా సామగ్రితో సాగునీటి కాలువలు, చెరువులు, నదుల వద్దకు వెళ్లి అరటి డొప్పల్లో దీపాలను వదిలి పెట్టారు. అనంతరం శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి : గాదె


మహేశ్వరిని సన్మానిస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడు, తదితరులు

ఎస్.రాయవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మండలంలోని గోకులపాడులో సోమవారం సాయంత్రం మండల పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువే మన గమ్యం పేరుతో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు గ్రహీతల అభినందన సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవార్డు గ్రహీతలను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం 61 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శ్రీనివాసుల నాయుడు, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పాయకరావుపేట మండల ఎంఈవో గాంధీ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వీరభద్రరావు, కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంట

▸ ఆందోళనలో రైతులు

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగాల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి కంకులు తడిసి బరువుతో నేలకొరుగుతున్నాయి. మూడు రోజులుగా పడుతున్న జల్లులకు వరి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వరి చేను వారం రోజుల క్రితమే కోయాల్సి ఉండగా వాతావరణ శాఖ హెచ్చరికతో ఆగిపోయారు. మరికొన్నిచోట్ల వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. మండలంలో ఖరీఫ్‌లో 1,390 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగు చేశారు. తిండి గింజలు ఇంటికి చేరుతాయన్న సమయంలో వర్షాలు కురవడంతో రైతుల్లో గుబులు మొదలైంది. కాగా సోమవారం ఉదయం నుంచి కొంత విరామం ఇచ్చినప్పటికీ కాస్త మోస్తరుగా వర్షం పడుతూనే ఉంది.


స్థల విషయమై సీఐ కుమారస్వామితో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

అవసరమైనచోట ఠాణాలకు కొత్త భవనాలు

▸ నక్కపల్లిలో స్థల పరిశీలన చేసిన హోం మంత్రి అనిత

నక్కపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శిథిలావస్థకు చేరిన పోలీస్‌స్టేషన్ల భవనాలను గుర్తించి, అవసరమైనచోట నూతన భవనాలను నిర్మిస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో పలు ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్లకు కొత్త భవనాలను నిర్మించినట్టు ఆమె చెప్పారు. సోమవారం నక్కపల్లి పాత పోలీస్ క్వార్టర్స్ సమీపాన వున్న స్థలాన్ని ఆమె పరిశీలించారు. నక్కపల్లిలో సర్కిల్ కార్యాలయం కూడా వుండడం, ప్రస్తుతం వున్న స్టేషన్ భవనం మరమ్మతులకు గురవడంతో కొత్త భవనం నిర్మించాల్సి వుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడెక్కడా కొత్త భవనాలు నిర్మించాల్సి వుందో పరిశీలిస్తున్నామని చెప్పారు. నక్కపల్లి, పాయకరావుపేట సీఐలు కుమారస్వామి, అప్పన్న, ఎస్ఐలు సన్నిబాబు, విభీషణరావులతో చర్చించారు. పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి సంబంధించి స్థలం కేటాయింపుపై తహసీల్దార్ నర్సింహమూర్తితో ఫోన్‌లో హోం మంత్రి మాట్లాడారు. ఆమె వెంట కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, బోడపాటి శివదత్, కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, మీగడ సత్తిబాబు, కురందాసు నూకరాజు, వైబోయిన రమణ, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పాటల పోటీలు రేపు

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమర గాయకుడు ఘంటసాల జయంతిని పురస్కరించుకుని 4వ తేదీన ఎలమంచిలిలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. స్థానిక ఘంటసాల మందిరంలో మహిళలు, పురుషుల సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఘంటసాల గానం చేసిన పాటలు మాత్రమే పాడాలన్నారు. విజేతలకు సాయంత్రం బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

నేలకొరిగిన వరి పంటను పరిశీలించిన ఏఓ


మురకాడలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏవో సుమంత

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుపాటు కురుస్తున్న వర్షాలకు పంచదార్ల, మురకాడ, కట్టుబోలు గ్రామాల్లో నేలకొరిగిన వరి పంటను వ్యవసాయాధికారిణి సి.సుమంత సోమవారం పరిశీలించారు. ఖరీఫ్‌లో 4,809 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారన్నారు. ఇప్పటివరకు ఏ గ్రామంలో వరి కోతలు ప్రారంభించలేదన్నారు. రెండు రోజులుపాటు కురిసిన వర్షాలకు 15 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందన్నారు. నేలకు పడిపోయిన వరిదబ్బులను పైకి లేపి కట్టాలని, పొలాల్లోని నీరు బయటకు పోయేటట్టు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఆమె వెంట వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

8న 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ప్రదర్శన

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందీశ్వర ప్రాంగణం తులసీ కళావేదికపై ఈనెల 8వ తేదీన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ప్రదర్శన ఉంటుందని విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ప్రచార కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ రంగస్థల దర్శకుడు స్వర్గీయ మొతికా సాంబశివరావు 9వ సంస్మరణ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టెక్కలి వీరకొండలరావు, పెంటకోట సత్యనారాయణ, మళ్ల జగ్గఅప్పారావు, బి. సీతారామరాజు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్ అందజేత


యువతకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న లాలం చందు

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లాలంకోడూరు పంచాయతీ శివారు సరాబుల కాలనీలోని యువతకు సోమవారం జనసేన పార్టీ యువనేత లాలం చందు క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ తమ తాత లాలం అప్పలకొండ జ్ఞాపకార్థం క్రికెట్ కిట్ అందజేశామన్నారు. కార్యక్రమంలో చందు సోదరులు లాలం రమేష్‌నాయుడు, అభిరామ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, వైద్య సిబ్బంది

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వైద్యాధికారులు, న్యాయవాదులు కలిసి ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ర్యాలీ చేపట్టి.. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవిచంద్ర, కార్తీక్, ఏజీపీ ద్వారపురెడ్డి వెంకటరావు, న్యాయవాదులు బి. హరిశంకరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి మాతృ వియోగం

నక్కపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం గ్రామంలో మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ తల్లి దేవర రాజులమ్మ(89) సోమవారం మృతి చెందారు. ఆమె కొద్ది రోజుల నుంచి అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంటనే హోం మంత్రి వంగలపూడి అనిత ఫోన్‌లో దేవర సత్యనారాయణను పరామర్శించారు. టీడీపీ సీనియర్ నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి కొండబాబు, వైబోయిన రమణ, నానేపల్లి రాఘవులు తదితరులు దేవర సత్యనారాయణను పరామర్శించారు.

రాజయ్యపేట హైస్కూల్‌ను డిప్యూటీ డీఈవో తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

నక్కపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట జడ్పీ హైస్కూల్‌ను సోమవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం మెనూపై ఆరా తీశారు. తరగతి గదిలో టెన్త్ విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈసారి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, పరీక్షల సమయంలో టెన్షన్ పడకుండా ప్రశాంతంగా వుండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట ఎంఈవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు, హెచ్‌ఎం నారాయణరావు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

కోటవురట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కోటవురట్ల ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా ఆటో నడపవద్దని సూచించారు. మైనర్లు ఆటో డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. మద్యం సేవించి ఆటోలు నడిపితే కేసు నమోదుచేస్తామని హెచ్చరించారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

పాయకరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక పార్కు సెంటర్ సమీపంలో కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గత నెల 22వ తేదీన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముగింపు సందర్భంగా సోమవారం స్వామివారికి విశేష పూజలనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు జగతా శ్రీనివాస్, కార్పెంటర్ల సంఘం నాయకుడు పెదపూడి నర్సింహమూర్తి, వేమవరపు చిట్టిబాబు, గానుగుల సత్యనారాయణ, సింహాద్రి నరసింహమూర్తి, కొప్పోజు శ్రీను, దివిలి వరహాలబాబు, నాగభూషణం, కొత్తల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మద్దతుదారుల గెలుపే లక్ష్యం కావాలి

▸▸ టీడీపీ శ్రేణుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద



సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

కశింకోట/కొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి మద్దతుదారుల గెలుపునకు అంతా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. జనవరి నుంచి కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బూత్‌లలో అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన నాయకులను సత్కరించారు. పార్టీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి, నిమ్మదల సన్యాసినాయుడు, సిదిరెడ్డి శ్రీను, గొంతిన శ్రీనివాసరావు, మజ్జి నిరంజన్‌కుమార్, ఎంపీటీసీలు బుదిరెడ్డి అప్పడు, షేక్ దర్గా, కాండ్రేగుల సతీష్, షేక్ బాబర్, ఆనాల తాతినాయుడు, నైనంశెట్టి రమణారావు, పెదపాటి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, అనకాపల్లిలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ అధ్యక్షతన జరిగిన కూటమి నాయకుల సమావేశంలో పీలా గోవింద మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగాన్ని భ్రష్టుపట్టించారని ఆరోపించారు. సాగునీటి సంఘాలను బలోపేతం చేయడంతో పాటు సాగునీటి కాలువలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల జోన్‌లో ప్రమాద ఘంటిక!

▸▸ పరవాడలో బాలికోన్నత పాఠశాలకు పిల్లల్ని పంపాలంటేనే హడలిపోతున్న తల్లిదండ్రులు ▸▸ తరుచూ పలువురికి గాయాలు ▸▸ పట్టించుకోని అధికారులు

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో పాఠశాల జోన్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడి ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారిలో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రాంతంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు హడలిపోతున్నారు. పాఠశాలకు వెళ్లేటప్పుడు, విడిచి పెట్టిన తరువాత బయటకు వచ్చే సమయాల్లో విద్యార్థినులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు.

వాహనాలతో నిత్యం రద్దీ

ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. సింహాద్రి ఎన్టీపీసీ, స్టీల్‌ప్లాంట్, ఎస్ఈజెడ్, ఫార్మాసిటీ, బార్క్ ప్రాంతాలకు ఉద్యోగులు, కార్మికులు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే గాజువాక, విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో చదువుకోవడానికి వెళ్లే విద్యార్థులు కూడా ఇదే రహదారి గుండా ప్రయాణిస్తుంటారు. దీని వల్ల ఉదయం, సాయంత్రం సమయాల్లో రహదారి చాలా రద్దీగా ఉంటుంది. రహదారికి ఆనుకుని బాలికల పాఠశాల ఉంది. విద్యార్థులంతా రహదారి దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతు న్నారు. అతివేగంగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనివల్ల ప్రమాదాలు కూడా ఎక్కువగానే జరుగుతున్నాయి.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా..

ఈ ప్రాంతంలో గతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే 2016 సెప్టెంబరు నెలలో జేఎన్ఎన్‌యుఆర్ఎం గృహ సముదాయం ప్రారంభోత్సవానికి అప్పటి ముఖ్యమంత్రి రాక సందర్భంగా భద్రతా దృష్ట్యా ఇక్కడి స్పీడ్ బ్రేకర్లును తొలగించారు. దీనివల్ల ఈ ప్రాంతంలో తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రతి రోజూ ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలకు వెళ్లిన తమ పిల్లలు ఇంటికి తిరిగి వచ్చే వరకు వారిలో ఒకటే టెన్షన్. ఈ ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలావుంటే, పాఠశాల జోన్ ప్రమాదకరంగా మారడంతో ఇటు స్థానికులు, అటు పాఠశాల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు, విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పరవాడలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న పాఠశాల జోన్ ప్రాంతం

ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి



పాఠశాల సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు దాటే క్రమంలో విద్యార్థినుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీని దృష్టిలో పెట్టుకుని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- లాలం చిన్నారావు, పరవాడ

ప్రజాప్రతినిధులకు వివరించాం



పాఠశాల జోన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఇదివరకే ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అయినప్పటికీ ఆదిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలి.

- ఎం.దివాకర్‌రావు, మండల విద్యాశాఖాధికారి

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి : జడ్సీ



ప్రజల నుంచి అర్జీను స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ రమణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కార్యాలయానికి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ అధికారులకు సూచించారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి పలువురు విచ్చేసి అర్జీలను సమర్పించారు. అందరితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వీటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమస్యలపై వినతి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకుడు కోన లక్ష్మణ కోరారు. ఈ మేరకు సోమవారం క్లాప్ డ్రైవర్లతో కలిసి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని, కార్మిక చట్టం ప్రకారం రూ. 21వేలు జీతం ఇవ్వాలని, డ్రైవర్లలందరికీ ఐడీ కార్డులు మంజూరు చేయాలని, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో సబ్సిడీతో కూడిన క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు సతీష్, కోన దుర్గా ఈశ్వరరావుతో పాటు గ్రేటర్ విశాఖ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు నరసింహమూర్తి, బి.రవికుమార్, యర్రంశెట్టి అప్పలరాజు, సింగంపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో ఏఎంఏఎల్ విద్యార్థికి బహుమతి

కొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎం ఏఎల్ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న వై.తేజ విఘ్నేష్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపాడు. ఇటీవల మునగపాకలో నిర్వహించిన ఈ పోటీల్లో 1700 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 25 మందిని ప్రతిభావంతులుగా గుర్తించి, ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున నిర్వాహకులు బహుమతులను అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ జి.జయబాబు తెలిపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థిని ఆయనతో పాటు వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్‌కుమార్, సూపరింటెండెంట్ పి.అనురాధ, ఇంటర్మీడియట్ కో-ఆర్డినేటర్ టి.జగదీశ్వరావు అభినందించారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు



ట్రై సైకిళ్లతో పరుగు పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు



క్యారమ్స్ పోటీ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం విభిన్న ప్రతిభావంతులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ పోటీల్లో రన్నింగ్, క్యారమ్స్, చెస్, షాట్‌పుట్ వంటి వాటిలో దివ్యాంగులు ఉత్సాహంగా తలపడ్డారు. విజేతలకు మంగళవారం వీవీ రమణ రైతు భారతిలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎల్.వి.రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పి.వీరుయాదవ్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి

▸▸ ముగిసిన కార్తీక మాసోత్సవాలు

▸▸ భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



ధ్వజస్తంభం వద్ద మహిళల దీపారాధన

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోలిపాడ్యమిని సోమవారం అంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసోత్సవాలు ముగింపు రోజున భక్తులు ఈ వేడుకను జరుపుకుంటారు. ఈ సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర, భోగలింగేశ్వర ఆలయాలతో పాటు కూరగాయల మార్కెట్ వద్ద గల శివాలయాల్లో స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు జరిపారు. ధ్వజస్తంభాల వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు దీపారాధన చేపట్టారు. అనంతరం అర్చకులకు తమ శక్తికొలది స్వయంపాక దానం, దీపదానం, సాలగ్రామ దానం వంటివి సమర్పించి ఆశీర్వచనాలు అందుకున్నారు. భోగలింగేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, డైరెక్టర్లు ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ ప్రారంభించారు. అంతకుముందు భోగలింగేశ్వరుడ్ని, సర్వకామదాంబ అమ్మవారిని వీరు దర్శించుకున్నారు.

సిద్ధిలింగేశ్వర ఆలయ ఉత్సవ కమిటీ ప్రమాణం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్‌రోడ్డు వద్ద గల సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్ అమరపల్లి కృష్ణాజీతో పాటు పాలక సభ్యులు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ, రాష్ట్ర గవర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కమిటీని నేతలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉత్సవ కమిటీ

కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్న పరిపూర్ణానందస్వామి



పూజలు చేస్తున్న స్వామిజీ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో జరుగుతున్న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కాకినాడ శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానందస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరుకొండ బుచ్చిరాజు, డాక్టర్ గ్రంధి శేషకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

5న పరవాడ మండల సమావేశం

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ తెలిపారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు ప్రారంభకానున్న సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

'పూర్తిస్థాయి అధికారులను నియమించాలి'

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. హెల్త్ ఆఫీసర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చినా పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఎం మహా సభల పోస్టర్లు ఆవిష్కరణ

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నంలో ఈ నెల 20 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న సీపీఎం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఇక్కడ ఆ పార్టీ మండల నాయకురాలు పి.మాణిక్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మాసిటీలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, 75 శాతం ఉపాధి స్థానికులకే కల్పించాలని తదితర విషయాలను మహాసభల్లో ప్రస్తావించడం జరుగుతాదన్నారు. పార్టీ మహిళా ప్రతినిధులు వెంకటలక్ష్మి, అరుణ, జయ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల ఉన్నతే లక్ష్యం కావాలి'

సబ్బవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంగలి ఎంపీయూపీ పాఠశాలలో పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన సైన్స్ టీచర్ పినాకిపాణిని పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ ఆమె సేవలను ప్రశంసించారు. విద్యార్థుల ఉన్నతే ఉపాధ్యాయుల లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఆకుల శ్రీహేమ, ఎంపీటీసీ గవర తులసీ, హెచ్ఎం హేమలత, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు : సీఐ

సబ్బవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎక్సయిజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ డి.అనిల్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం అక్రమ అమ్మకాలు జరగకుండా ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

'ఉన్నతి' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'ఉన్నతి' కార్యక్రమం పోస్టర్‌ను కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. 2018-2024 మధ్య కాలంలో ఉపాధి హామీ పథకం కింద వంద రోజులపాటు పనులు చేసిన కుటుంబాల్లో 18-35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం శిక్షణ ఇవ్వడం ఈ కార్యక్రమం ఉద్దేశం. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతితోపాటు, వంద రోజుల కూలీ రేటు ప్రకారం స్కాలర్‌షిప్ చెల్లిస్తారు. శిక్షణలో 75 శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌తోపాటు శిక్షణ అనంతరం ప్రముఖ బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి, డ్వామా పీడీ బి.పూర్ణిమదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్ పై అవగాహన తప్పనిసరి

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సింహాద్రి ఎన్టీపీసీ మొబైల్ హెల్త్‌కేర్ యూనిట్ వైద్యాధికారి డి.ప్రశాంత్ ప్రణీత్‌కుమార్ అన్నారు.న ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని మండలంలోని వెన్నెలపాలెం, సోమునాయుడు పాలెం గ్రామాల్లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. వెన్నెలపాలెం ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ పైలా రథాల సన్యాసిరావు, పీవీ నరసింహారావు, వెన్నెల ఈశ్వరరావు, బి.నాయుడు, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్‌తో పిల్లల్లో సేవా దృక్పథం : డీఈవో

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులకు స్థానిక జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ ఈ టీచర్లు ప్రతి స్కూల్‌లో 32 మంది బాలురు, 32 మంది బాలికలకు శిక్షణ ఇవ్వడం ద్వారా పిల్లల్లో మనోధైర్యం పెరిగి సేవా దృక్పథంతో ముందుకు నడుస్తారన్నారు. విద్య, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు రావడం ద్వారా వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని వివరించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి కొణతాల రత్నకుమారి మాట్లాడుతూ సుమారు వంద స్కూళ్లలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పెట్టడం ద్వారా 6400 మంది ప్రతి ఏటా స్కౌట్స్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ రమణ, స్వామినాయుడు, మహ్మద్ షరీఫ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతం కావాలి

▸▸ పార్టీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు పిలుపు



కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామ్మూర్తిని సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

కొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీ సీఎం రమేష్ కార్యాలయంలో సోమవారం జరిగిన సంఘటన్ పర్వ్-2024 జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీల నియామకం నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. సంస్థ ఎన్నికల అధికారి పరశురామరాజు మాట్లాడుతూ మూడు రోజుల పాటు బూత్ కమిటీల నియామకం, మరో పది రోజుల్లో మండల అధ్యక్షుల ఎన్నికలు పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలాఖరున రాష్ట్ర అధ్యక్ష పదవికి, జనవరిలో జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగే అవకాశముందని చెప్పారు. అనంతరం ఇటీవల రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఈర్లె శ్రీరామ్మూర్తిని సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, నాయకులు పొన్నగంటి అప్పారావు, పి.రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆనుకుని ఉన్న రహదార్లపై ప్రమాదాల నివారణకు చర్యలు

▸▸ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీఐ సూచన ▸▸ ఆ మేరకు స్పందించిన పరవాడపాలెం గ్రామస్థులు

కశింకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలను ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పరవాడపాలెం గ్రామానికి వెళ్లి ప్రారంభంలో సోమవారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. తొలుత గ్రామస్థులతో సీఐ సమావేశమయ్యారు. జాతీయ రహదారిపైకి గ్రామం నుంచి వేగంగా వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించ వచ్చునని ఆయన తెలిపారు. దీంతో అంతా కలిసి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ విధంగా ప్రతి గ్రామం ప్రారంభంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్ఐ మనోజ్‌కుమార్, గ్రామస్థులు బలిజ మంగ, బలిజ ముసిలినాయుడు, ఉగ్గిన రమణమూర్తి, గొంతిన గంగాధర్, పందిర ప్రసాద్, మామిడి నాగేంద్ర, పైడివాడ నాగరాజు, గుండుమల్లి వెంకటేష్, రెడ్డి గణేష్, దాసులు తదితరులు పాల్గొన్నారు.



పరవాడపాలెం ప్రారంభంలో స్పీడ్ బ్రేకర్ నిర్మిస్తున్న దృశ్యం

హమ్మయ్యా.. వర్షపు నీటి కష్టాలు తీరాయి

మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం ఎత్తు చేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కార్యాలయం ప్రాంగణంలో వర్షపు నీరు (ఫైల్)



మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణం ప్రస్తుత పరిస్థితి

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో వర్షపునీరు నిల్వ లేకుండా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. సిమెంట్, నల్లపిక్క కలిపి కాంక్రీట్‌తో ప్రాంగణాన్ని ఎత్తు చేయడంతో సమస్య పరిష్కారమైంది. 'వర్షపునీటితో మండల పరిషత్ కార్యాలయ అధికారుల ఇక్కట్లు' శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. మండల పరిషత్ కార్యాలయ భవనం మరమ్మతుల నిమిత్తం సాధారణ నిధులు రూ. 24.8 లక్షలు కేటాయించారు. వీటితో భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడుతున్నారు. అలాగే కార్యాలయ ప్రాంగణాన్ని కాంక్రీట్‌తో ఎత్తు చేశారు. దీంతో వర్షాలు కురిసే సమయాల్లో కార్యాలయ ప్రాంగణంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారమని, ప్రస్తుతం సమస్య పరిష్కారమైందని సిబ్బందితో వివిధ పనులపై వచ్చేవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పాడేరులో 108 మట్టి శివలింగాలతో అలంకరణ



సీలేరులో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



అయ్యప్ప ఆలయంలో భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్పస్వాములు

వైభవంగా కార్తీక దీపారాధన

» శివాలయాల్లో భక్తులు రద్దీ

» నదీ స్నానాలు, ప్రత్యేక పూజలు

పాడేరురూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అతిపురాతన శైవక్షేత్రం ఉమా నీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంల ఆదివారం రాత్రి 108 మట్టి శివలింగాలతో చేపట్టిన మహా దీపోత్సవ కార్యక్రమం ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ఆలయ ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యుల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఏకధాటిగా వర్షం కురుస్తున్నా వందలాది మంది భక్తులుపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు 108 లింగాలతో దీపాలంకరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక బృంద సభ్యులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు కొట్టగుళ్లి రామారావు, డి.బాబూరావు, వి.రాజుబాబు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక దీపారాధన కార్యక్రమాలను సోమవారం వైభవోపేతంగా జరిపారు. కార్తీక మాసం నెల రోజులపాటు భక్తి శ్రద్ధలతో పవిత్ర స్నానాలు ఆచరించిన మహిళలు.. సోమవారం పోలిపాడ్యమిని నిర్వహించారు. ఈసందర్భంగా వంతాడపల్లి వద్దగల చిలకలమామిడి గెడ్డ, బొక్కెళ్ల గ్రామ సమీపంలో ఉన్న మత్స్యగెడ్డ ప్రాంతాలకు అధిక సంఖ్యలో తరలివెళ్లి అరటి జేరుల్లో ఒత్తులు వెలిగించి, ప్రసాదాలను పెట్టి దీపాలను నదుల్లో భక్తి శ్రద్ధలతో విడిచిపెట్టారు. అక్కడ నుంచి వచ్చిన భక్తులుపట్టణంలోని శివాలయాలు, మోదకొండమ్మ, షిర్డీసాయి ఆలయాలకు వెళ్లి పూజలను చేసి కార్తీక మాస ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి

సీలేరు: సీలేరులో చివరి కార్తీక సోమవారం, పోలిపాడ్యమి ని పురస్కరించుకుని భక్తులు స్థానిక శివాలయంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించా రు. తెల్లవారుజాము నుంచి మహళలు సీలేరు నదిలో స్నానాలను ఆచరించి నీటిలో దీపాలను వదిలారు. అనంతరం స్థానిక శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలను నిర్వహించి శివపార్వతులను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

పాడేరురూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో నెలకొన్న పూర్ణ పుష్కల అయ్యప్పస్వామి ఆలయ 30వ వార్షికోత్సవం ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు, ఆయన సోదరి పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయంలో వెంకటేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామి తదితర దేవుళ్లకు భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన చేపట్టారు. అయ్యప్ప, శివ మాలదారులు వంద మందికి ప్రత్యేకంగా భిక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు వర్తన పిన్నయ్యదొర, కార్యదర్శి ఇమిడిశెట్టి అనీల్‌కుమార్, ఆలయ కమిటీ ప్రధాన సభ్యులు రొబ్బి రాము, వర్మ సత్తిబాబు, అయ్యప్ప గురుస్వాములు వెయ్యాకుల సత్యనారాయణ, ఏడుకొండలు, ఈశ్వరరావు, గ్రామ పెద్దలు, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల సంరక్షణకు పటిష్ఠంగా పనిచేయాలి

» కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్



సర్పంచ్ వరలక్ష్మితో కలిసి గ్రావిటీ పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

చింతపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రక్షిత తాగునీటి పథకాల సంరక్షణకు విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీ (వీడబ్ల్యూఎస్‌సీ) పటిష్ఠంగా పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ అన్నారు. సోమవారం చింతపల్లి, కొయ్యూరు సరిహద్దు గిరిజన గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ నవనిర్మాణ సమితి నిర్మించిన గ్రావిటీ తాగు నీటి పథకాలను ప్రారంభించారు. తొలిసారిగా ఐఏఎస్ అధికారి గిరిజన గ్రామాలకు వస్తుండడంతో ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్‌కి మహిళలు తిలకం దిద్ది, కోలాటం, ధింసా నృత్యాలతో గ్రామ శివారునుంచి తీసుకొచ్చారు. సుమారు రూ.14లక్షల నిధులతో గొందిపాకలు పంచాయతీ పొర్లుబంద, సమగిరి, డౌనూరు పంచాయతీ నిమ్మలపాలెం, గొప్పువీధి గ్రామాల్లో నిర్మించిన గ్రావిటీ పథకాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ మహిళలు ఎన్నో ఏళ్లగా ఊట గెడ్డల నుంచి నీళ్లు తెచ్చుకుంటూ ఇబ్బంది పడుతున్నారన్నారు.ఈ నీటి పథకాలతో మహిళల కష్టాలు తీరినట్లైనన్నారు. నవనిర్మాణ సమితి గిరిజనుల భాగస్వామ్యంతో నీటి పథకాలను నిర్మించిందన్నారు. వీటిపి ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈపథకాల నిర్వాహణ బాధ్యతలను వీడబ్ల్యూఎస్‌సీ తీసుకోవాలన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రహదారులను నిర్మిస్తామన్నారు. ప్రజలు ఎటువంటి సమస్య తలెత్తిన మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అప్పటికీ పరిష్కారం కాకుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్, ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, సర్పంచ్ సాగిన వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు మోహనరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. ఒకరికి తీ వ్రగాయాలు



గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న ధారకొండ వైద్యాధికారి హిమబిందు

సీలేరు, డిసెంబరు 2 : (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో బైక్ నడిపి ప్రమాదానికి లోనవడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. జీకేవీధి మండలం ధారకొండ స్మశాన వాటిక సమీపంలో ప్రధాన రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతకోటకు చెందిన గడుతూరి ధారబాబు, వణుగుల శాంతికుమార్ ద్విచక్ర వాహనంపై వస్తూకమ్మరితోట వద్ద ఓ దుకాణంలో 3 లీటర్ల పెట్రోల్ దొంగతనం చేశారు. అనంతరం మద్యం మత్తులో వాహనాన్ని అతి వేగంగా నడిపి స్మశాన వాటిక వద్ద ప్రధాన రహదారిపై అదుపు తప్పిపడిపోయారు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో వెంటనే అంబులెన్స్‌లో వారిద్దరిని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందించారు. గడుతూరి ధారబాబుకు ముఖానికి, ఛాతికి బలంగా గాయాలు తగలడంతో సంఘటనా స్థలంలోనే స్పృహ కోల్పోయాడు. అతనికి గంట పాటు సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యాధికారి హిమబిందు తెలిపారు. ఈ సంఘటనపై సీలేరు పోలీసులకు సమాచారమిచ్చామన్నారు.

అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



వినతిపత్రం పరిశీలిస్తున్న కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో వివిధ సమస్యలపై ఆయనకు పలువురు వినతిపత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మంది నుంచి గ్రామాల్లో రోడ్లు, కల్వర్టులు, నీటి పథకాలు నిర్మించమని వినతులు అందుతున్నాయని, వాటిని ప్రాధాన్యతా క్రమంలో చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలుచేపడుతుందన్నారు. హుకుంపేట మండలం బాకూరు నుంచి ఉప్ప గ్రామానికి రోడ్డు, బొర్రగొంది వద్ద కల్వర్ట్ వాల్స్ నిర్మించాలని, ఓల్డా పంచాయతీ పూసలగరువులో బోరింగ్ వేయించాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. స్థానిక మెడికల్ కాలేజీలోని అన్ని పోస్టుల్లోనూ గిరిజన అభ్యర్థులనే నియమించేలా కృషి చేయాలని పలువురు కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణ, సాగర సుబ్బారావు, తామర్ల సత్యనారాయణ, ఎన్.ప్రసాద్, లైకోన్, రాంబాబు, త్రినాథ్, ఎస్.సూర్యకాంతం, మహేశ్వరి, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి: పీవో



తురకలవలసలో కెరీర్ గైడెన్స్ శిక్షణను ప్రారంభిస్తున్న పీవో అభిషేక్

పెదబయలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆకాంక్షించారు. సోమవారం ఆయన గిరజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజనితో కలసి మండలంలోని తురకలవలస బాలికల ఆశ్రమ పాఠశాల, పెదబయలు బాలుర-1 పాఠశాలలను సందర్శించారు.ముందుగా తురకలవసలో పాఠశాలలో మాజీ రా ష్ట్ర పతి దివంగత డాక్టర్ బాబూరాజేంద్ర ప్రసాద్, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం పెదబయలు పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న కెరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి తరువాత తాము ఏ రంగంలో స్థిరపడాలనే అంశంపై స్పష్టత ఉండాలన్నారు. అలాగే, ఇంటర్మీడియట్‌లో ఏ కోర్సులు చదవాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆశయాలు ఎప్పుడు ఉన్నతంగానే ఉండాలన్నారు. ఎన్ని కష్టాలువచ్చినా విద్యను దూరం పెట్టకూడదని, చదువే తమను ఉన్నత శిఖరాలకు చేరువ చేస్తుందని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజన విద్యార్థుల ప్రగతికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూ వెంకటరమణ, ఎంఈవో, మార్గదర్శిని శిక్షకులు, హెచ్‌ఎంలు గంగాబై, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణగా మహిళా సాధికారిక హెల్ప్‌లైన్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి

పాడేరురూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిక హెల్ప్‌లైన్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి సూచించారు. కళాశాల మహిళా సాధికారిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో జెండర్ ఈక్వాలిటీ.. గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఉమెన్ హెల్ప్‌లైన్ అనే అంశాలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారిక శాఖ వారు విద్యార్థులకు క్రమశిక్షణ, బాధ్యతలను వివరించి వారిని పర్యవేక్షించాలన్నారు. ఈ వర్క్‌షాపు బాలికలు, మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు గురైనా మహిళాసాధికారిక హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, మహిళా సాధికారిక సమన్వయకర్త పి.సౌజన్య, ఐక్యూసీ-కో ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, మహిళా సాధికారిక మెంబర్లు టి.సుమిత్ర, కె.నిర్మల, డాక్టర్.సునీత, ఎం.రాధాకుమారి, ఈవీజయలక్ష్మి, వారిజ, హిమబిందు, జీవనజ్యోతి, ప్రసన్న, లావణ్య, సబిత తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి :సీఐ



అవగాహన కల్పిస్తున్న సీఐ ఆచార్య

జి. మాడుగుల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పాడేరు ఎక్సైజ్ సీఐ ఆచార్య సూచించారు. సోమవారం ఆయన మండలంలోని వంజరి పంచాయతీ కిముదుపల్లి గ్రామాన్ని సందర్శించారు. స్థానిక గిరిజనులు, యువతకు డ్రగ్స్, నాటు సారా, గంజాయి సాగు, రవాణాపై అవగాహన కల్పించారు. వ్యసనాలతో జీవితాలు చిన్నభిన్నమవుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలి

» గిరిజన సంఘం ప్రతినిధి కిల్లో సురేంద్ర



మాట్లాడుతున్న నాయకులు సురేంద్ర, బాలదేవ్ తదితరులు

అరకులోయ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాడేరు వైద్య కళా శాలలో భర్తీచేసే పోస్టులలో వందశాతం గిరిజనులకే కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రతినిధి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాడేరు వైద్య కళాశాలలో వివిధ పారా మెడికల్, ఒప్పంద, పొరుగు సేవల పోస్టులు సుమారు 256 పోస్టుల భర్తీ నియామక ప్రక్రియ చేపడుతున్నారని, వీటిలో 100వరకు గిరిజనేతరులకు కేటాయించారని పేర్కొన్నారు. కూటమిప్రభుత్వం హామీ మేరకు జీవో 3 పునరుద్ధరించి శత శాతం పోస్టులు గిరిజనులకే కేటాయించాలన్నారు. వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్‌లకు చెందిన 31 పోస్టుల్లో ఒకటి, జనరల్‌డ్యూటీ అటెండెన్స్ మొత్తం 169 పోస్టులకుగాను 30 పోస్టులు, ఆఫీస్ సబార్డినేటర్స్ మొత్తం 269 పోస్టులకు గాను 57 పోస్టులు గిరిజనేతలరులకు కేటాయించారన్నారు. జీవో3కు వ్యతిరేకంగా పోస్టులు భర్తీ చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేంద్ర, బాలదేవ్, బుజ్జిబాబు, చిన్నబాబు, కె.జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణపై తప్పుడు ప్రచారం సరికాదు

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరు అభివృద్ధి కూటమి ప్రభుత్వ పాలనతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. పాడేరు మెయిన్‌రోడ్ల విస్తరణను తాను అడ్డుకుంటున్నట్టు, వైసీపీ ప్రోత్సాహంతో పలువురు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆమె సోమవారం టీడీపీ నేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో (2014- 19)లో పాడేరు పట్టణం అభివృద్ధి, సుందరీకరణకు రూ.43 కోట్లు మంజూరు చేయించానన్నారు. తర్వాత 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని రద్దు చేయించిందన్నారు. ప్రస్తుతం తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్లు, వైసీపీ శ్రేణులు ఈ ఐదేళ్లు పాడేరు అభివృద్ధికి ఏమి చేశారని గిడ్డి ఈశ్వరి ప్రశ్నించారు. సంఘాల ముసుగులో వైసీపీ తరఫున కూటమి ప్రభుత్వం, నేతలపై, తనపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని, లేకుండా తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పాడేరు పట్టణం అభివృద్ధికి తాజాగా సీఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడి రూ.50 కోట్లు మంజూరు చేయించామన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే పాడేరులో రోడ్ల విస్తరణ, సుందరీకరణ జరుగుతుందన్నారు. తమ వ్యక్తిగత, వైసీపీ అజెండాలతో ప్రభుత్వంపై, కూటమి నేతలపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు బొర్రా నాగరాజు, చల్లంగి లక్ష్మణరావు, డప్పోడి వెంకటరమణ, బొర్రా విజయరాణి, అల్లంగి సుబ్బలక్ష్మి, ఎంపీపీ రత్నకుమారి, మాజీ ఎంపీపీ రమణమూర్తి, జనసేన మహిళా నేత కిట్లంగి పద్మ పాల్గొన్నారు.

అంతర్ కళాశాల క్రీడల్లో సత్తా చాటిన డిగ్రీ విద్యార్థులు



రాణించిన విద్యార్థులతో పీడీ శివరామ్ కుమార్

చింతపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధి అంతర్ కళాశాలల క్రీడల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. వివరాల్లోకి వెళితే, గత నెల 23, 24తేదీల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో అంతర్ కళాశాలల క్రీడాపోటీలు జరిగాయి. ఈపోటీల్లో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో విద్యాభ్యాసం చేస్తున్న తగ్గి ఓంకార్ అథ్లెటిక్స్ విభాగంలో త్రిబుల్ జంప్‌లో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం సాధించాడు. అలాగే ప్రథమ బీఏ చదవుతున్న పాంగి రమేశ్ జావలింగ్ త్రోలో ద్వితీయ స్థానం సాధించాడు. విజేతలకు సోమవారం విశ్వవిద్యాలయం అధికారులు మెడల్స్, ధ్రువపత్రాలను అందజేశారు. కాగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, పీడీ శివరామ్ కుమార్‌ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అభినందించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జగ్గత్‌రాయ్ పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో బయట సంచరిస్తే కేసులు నమోదు



ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో ఎవరూ అనవసరంగా బయట సంచరించరాదని స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా మండల కేంద్రంతో పాటు పలు చోట్ల దొంగతనాల జరిగిన నేపథ్యంలో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ, వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్టు వివరించారు. ఈ మాట్లాడుతున్న స్థితిలో రాత్రి 11 గంటలు దాటిన తరువాత పని లేకుండా ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. వస్తే దొంగలుగా అనుమానించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వ్యాపారులు విధిగా షాప్‌ల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

జి. మాడుగుల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వంట గ్యాస్ లీకై నష్టపోయిన మండలంలోని కె.కోడాపల్లి లో సోమెలి భాస్కర్‌రావు, సింహాచలం కుటుంబాలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీటీడీసీ డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు క్వింటా బియ్యం, వంట పాత్రలు, నిత్యావసర సరుకులు అందించారు. జరిగిన ఘటనపై వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వెంకట సురేశ్‌కుమార్, నాయకులు కె.సింహాచలం, టి.సూరిబాబు, కె.బొంజుబాబు, పి.కృష్ణమూర్తి, జి.అప్పారావు, ఎం.రామారావు, కె.చిన్నారావు, కె.చిన్నకొండబాబు, ఎం.అప్పారావు, కె.సన్నీబాబు, ఎస్.సూరిబాబు, ఎల్.మహేశ్, పి.కొండబాబు పాల్గొన్నారు. శ్రీకుసుమహరనాథ నామ ప్రచార సంఘం దువ్వాడ ద్వారా ఆ సంఘం నేతలు వి. విజయ్‌కుమార్, ఆర్‌వీ ఎస్ రమేశ్ ఆధ్వర్యంలో బాధితులకు దుస్తులు, నిత్యావసరాలు, వంట పా త్రలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్. దివాకర్, ఎస్.రాము, సర్పంచ్ మాతె చిలకమ్మ తదితరులు పాలొన్నారు.

సారా తయారీ, విక్రయాలు చేపడితే కేసులు



ధ్వంసం చేసిన సారా పులుపు డ్రమ్ములతో ఎక్సైజ్ సిబ్బంది

చింతపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలు చేపడితే కేసులు పెడతామని స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె.కూర్మారావు హెచ్చరించారు. సోమవారం మండలంలోని పెదగొంది, రబ్బరుగొంది గ్రామాల్లో విశాఖపట్నం ఎక్సైజ్ స్టేషన్, నర్సీపట్నం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. ఈమేరకు గ్రామ శివారులో నాటు తయారీకి సిద్ధం చేసిన 1600 లీటర్ల పులుపును ధ్వంసం చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సారా తయారీపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు

పాఠశాలలకు టీవీలు పంపిణీ



ప్రభుత్వం సరఫరా చేసిన టీవీలను ఉపాధ్యాయులకు అందచేస్తున్న దృశ్యం

కొయ్యూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దృశ్య శ్రవణ విద్యావిధానం అమలు చర్యల్లో భాగంగా మండలంలో 14 ఎంపీపీ, జీపీఎస్ పాఠశాలలకు టీవీలు సరఫరా చేస్తున్నట్టు ఎంఈవో రాంబాబు తెలిపారు. ఈ మేరకు మండలంలో దొడ్డవరం, కిత్తాబు, పోతవరం, కునుకూరు, నల్లబిల్లి, కాకరపాడు, నిమ్మలగొంది, ముల్లుమెట్ట, కర్నికపాలెం, ఆడాకుల, అంకంపాలెం, కుమ్మర్లబంధ, నిమ్మలపాలెం, గధభపాలెం, పాఠశాలలకు టీవీలను సోమవారం అందించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు టీవీలతో పాటు కీపేడ్, మౌస్, కేబుల్ వైరు పంపిణీ చేసినట్టు ఎంఈవో తెలిపారు. వీటి ద్వారా బోధన సాగించాలన్నారు.

కనువిందు చేస్తున్న పర్యాటక ప్రాంతాలు



హెక్టగుడ సీఎస్‌ఐ చర్చి వద్ద పొగమంచు అందాలు

అనంతగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం జలపాతం కనువిందు చేస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు నీరు ఉరకలేస్తూ పారుతోంది. ప్రకృతి అందాల మధ్య ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనిని చూసేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలిస్తున్నారు.. వైకుంఠగిరిని దర్శించుకుని, వచ్చేదారిలో ఉన్న కాశీపట్నం జలపాతాన్ని వద్దకు వచ్చి సందడి చేస్తున్నారు. ఐదు స్టెప్‌లపై నుంచి జలపాతం పారుతుంది. స్నానాలు చేసేందుకు వీలుగా ఉండడంతో పర్యాటకులు జలకాలాడుతున్నారు.

మన్యంలో ప్రకృతి అం దాలకు కొదువలేదు.. ప్రస్తుతం పొగమంచు అం దాలు కనువిందు చేస్తున్నాయి.. దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కన్పించకపోవడంతో.. లైట్లువేసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. హెక్టగుడ సీఎస్‌ఐ చర్చి చుటూ పొగమంచు ఆలరిస్తోంది.



పరవళ్లు తొక్కుతున్న కాశీపట్నం జలపాతం

శ్రమదానంతో రహదారి మరమ్మతులు



మరమ్మతు పనుల్లో గిరిజనులు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీకేవీధి పంచాయతీ తంగళ్లగొంది గ్రామానికి చెందిన గిరిజనులు శ్రమదానంతో రహదారి మరమ్మతులు చేసుకున్నారు. గ్రామానికి ఉన్న గ్రావెల్ ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కోతకు గురైంది. దీంతో రోగులు, గర్భిణులను డోలిపై ఆస్పత్రికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన గిరిజనులు ఆది, సోమవారాలు శ్రమదానం చేసి రహదారిని బాగు చేశారు.

వరిలో ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి



అన్నవరంలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ప్రదీప్ కుమార్

చింతపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు తడిచిన వరి మొలకెత్తకుండగా ఉండేందుకు పనలపై 5శాతం ఉప్పుద్రావణాన్ని పిచికారీ చేయాలని పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. సోమవారం చింతపల్లి, జి.మాడుగుల మండలంలోని పలు గిరిజన గ్రామాలను పర్యటించి పంట పొలాల తాజా పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వర్షాలు తగ్గే వరకు వరి కోతలు చేసుకోరాదన్నారు. ఇప్పటికే కోత చేసుకున్న పనలపై ఎకరానికి 25కిలోల ఉప్పు చల్లి కుప్పలుగా వేసుకోవాలన్నారు. డీఆర్‌సీ ఏవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొయ్యూరు: వర్షాలకు తడిసి నేలకొరిగిన వరి పంట మొలకెత్తకుండా పనలుగా కట్టి నిలబెట్టు కోవాలని ఏవో ఉమాదేవి రైతులకు సూచించారు. సోమవారం మండలంలో చిట్టింపాడు, డౌనూరు రైతు సేవ కేంద్రాల పరిధిలో తుఫాన్ ప్రభావంతో నేలకొరిగి నీట మునిగిన వరి చేలను సిబ్బందితో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతు సేవ కేంద్రాల సిబ్బంది అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలకు సత్వర పరిష్కారం : ఆర్డీవో



ఇటుక బట్టీలపై ఆర్డీవోకి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

నర్సీపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో వీవీ రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. గబ్బాడ ఇసుక నిల్వ కేంద్రం ఎదురుగా ఉన్న ఇటుక బట్టీలతో దూళి, పొగ కాలుష్యంతో 30 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న బి.కామతల్లి, బి.సరోజిని, టి.పార్వతి తదితరులు ఫిర్యాదు చేశారు. వాసవీ కల్యాణ మండపంలోని ఆర్థిక లావాదేవీలపై విచారణ చేయించాలని సురేశ్ ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 10 వినతిపత్రాలు అందినట్టు ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: సీఐ అప్పలరాజు



విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అప్పలరాజు

చోడవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ బి. అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం ఎన్ ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీ ఐ అప్పలరాజు మాట్లాడుతూ, టెక్నాలజీ సాయంతో చేస్తున్న సైబర్ నేరాల వల్ల అమాయకులు నష్టపోతున్నారని, గ్రామాల్లో ప్రజలకు వీటి బారిన పడకుండా విద్యార్థులు చైతన్యపరచాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. వాహనాల త్రిబుల్ రైడింగ్ ఆపాలని, లైసెన్సు లేకుండా నడపవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, ఎన్ ఎస్ ఎస్ పీవోలు మాల్యాద్రి, బిచ్చమ్మ, లెక్చరర్లు పాల్గొన్నారు.

'పీఏసీఎస్‌లో అక్రమాలపై చర్యలేవీ?'

రోలుగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీరాంపురం పీఏసీఎస్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక (ఆర్పీఐ) కార్యదర్శి జక్కు నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అక్రమాలపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా విచారణ పేరుతో కాలయాన చేస్తున్నారన్నారు. గత ఏడాదిగా తప్పుడు నివేదికలు ఇస్తున్నారన్నారు. బినామీ రుణాలు, నిధుల స్వాహాపై విచారణ చేపట్టి సొమ్ములు రికవరీ చేయాలన్నారు.

పౌరహక్కులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దారు రమాదేవి

మాడుగుల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పౌరహక్కులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తహసీల్దారు రమాదేవి అన్నారు. సోమవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా కేజేపురంలోని ఎస్సీ కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ సామాజిక పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్సీ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, జిల్లా ఎస్సీ , ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ మెంబర్ మరువాడ ఈశ్వరరావు సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీసభ్యులు లోవ చిన్నతల్లి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

రావికమతం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ జడ్పీ హైస్కూల్‌లో సోమవారం దివ్యాంగ విద్యార్థుల ఆటల పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడులు తెలిపారు. మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 45 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై స్పందించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ

చోడవరం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి స్థానిక వినాయక గుడి సెంటర్ వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్ర భుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కార్మికులను దెబ్బతీసేవిధంగా జగన్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 17ని తక్షణం రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాపీమేస్త్రీల సంఘం కార్మిక సంఘాల నాయకులు కోన నూకరాజు, నారం మధుప్రసాద్, బొంతు దేవుడు, నౌడు అప్పారావు. కనకారావు, నాగిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

ప్రభుత్వ హెచ్చరిక బోర్డు తొలగింపుపై ఫిర్యాదు

దేవరాపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ కొత్తపల్లిలో చాకలి బందలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోర్డును తొలగించారంటూ తహసీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 289లో 1.18 సెంట్లలో గల బందపై రెండేళ్ల కిందట కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణలు తొలగించి అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారు. వాటిని ఆక్రమణ దారులు తొలగించారని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పి.మరిడిబాబు, రమణ, పెంటయ్య, కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎరకన్నపాలెంలో తాగునీటి కష్టాలు

» మూడు రోజులకొకసారి కొళాయిల ద్వారా నీరు.. » ఫ్లోరైడ్ బోర్లు నీరే గతి.. » పట్టించుకోని అధికారులు



ఫ్లోరైడ్ బోరు వద్ద నీటి కోసం వేచి వున్న మహిళలు



నేలబావి నీరు తోడుతున్న మహిళలు

మాకవరపాలెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వేసవి రాక ముందే ఎరకన్నపాలెంలో తాగునీటి కష్టాలు మొదలైయ్యాయి.గత ఐదేళ్ల గా తాగు నీటి కష్టాలను అధికారులు తీర్చలేక పోయారని గ్రామస్థులు మండిపడుతున్నారు.

మండలంలోని రాచపల్లి శివారు ఎరకన్నపాలెంలో 300 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ గ్రామంలో తాగునీటి పథకంతోపాటు ఐదు బోర్లు ఉన్నాయి. అయితే భూగర్భజలాలు అంతంతమాత్రంగా ఉండడంతో ప్రతి ఏటా తాగు నీటి కష్టాలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 22లక్షలతో జల జీవన్ మిషన్ పనులు ప్రారంభించి ఇంటింటికి కొళాయిలు వేశారు. ఈ కొళాయిల్లో మూడు రోజులకు ఒకసారి తాగునీరు వస్తున్నది. ఉన్న బోర్ల నీటిలో ఫ్లోరైడ్ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో కొన్ని బోర్లు పూర్తిగా మూతపడ్డాయి. అయితే కొళాయిల నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో ఫ్లోరైడ్ బోర్ల నుంచి నీటిని వాడక తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర అవసరాలకు గ్రామంలో ఉన్న నేల బావి నీటిని వాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లచ్చన్నపాలెంలో ఉన్న తాగునీటి భారీ ప్రాజెక్టు ద్వారా తాగునీటి సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నాం

» అడిగర్ల ఎర్రినాయుడు, వార్డు మెంబరు



గ్రామంలో తాగునీటి కష్టాలు అన్ని ఇన్నీ కావు. ప్రతి ఏటా ఇదే సమస్య తలెత్తడంతో బోర్లు ద్వారా వస్తున్న ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నాం. దీనివల్ల కాళ్ల నొప్పులు వస్తున్నాయి. కొళాయిల ద్వారా మూడు రోజులకు ఒకసారి అరగంట మాత్రమే నీరు వస్తున్నది. ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. అధికారులు, పాలకులు స్పందించాలి.

కొళాయి నీరు ఎప్పుడో వస్తుంది..

» లగుడు భవానీ, ఎరకన్నపాలెం



ఐదేళ్లగా తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నాం. ఇంటింటి కొళాయిలు వేశారు. కానీ నీరు మాత్రం రావడం లేదు. గ్రామంలో ఉన్న నేలబావి, ఫ్లోరైడ్ నీటిని వాడుతున్నాం.దీనివల్ల వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలకు కూడా ఈ నీటిని వాడవలసి వస్తున్నది. అధికారులు స్పందించి తాగునీటి అందించాలి.

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు



దివ్యాంగులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న ఎంఈవో

కృష్ణాదేవిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏఎల్‌పురం జిల్లాపరిషత్ హైస్కూల్ వంద మంది దివ్యాంగుల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. భవిత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు రన్నింగ్, మ్యూజికల్ చైర్, చిత్రలేఖనం, ఝూటింగ్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేష్ మాట్లాడుతూ దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, రామరాజు, రామ్‌కుమార్, అచ్చిబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

ఈనెల మూడో తేదీన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగామండల కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించామని ఎంఈవో మూర్తి తెలిపారు. భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో మ్యూజికల్ చైర్, డ్రాయింగ్, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు వరలక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత వేళలు పాటించని మద్యం షాపులపై కేసులు

» దుకాణాల వద్ద ఎమ్మార్పీ పట్టిక ఉండాలి

» ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ నాయుడు

చోడవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన సమయం కంటే ముందుగా తెరిచే మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఉదయం 10గంటలకు తెరిచి, రాత్రి 10గంటలకు దుకాణాలు మూసివేయాలని స్పష్టంచేశారు. ఈ వేళలు అతిక్రమించిన బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేటలో మద్యం దుకాణంపై కేసు నమోదు చేశామన్నారు. దుకాణాల వద్ద ధరల పట్టిక , సీసీ కెమెరాలు, గ్రిల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. వీలైనంత వరకూ ఆన్‌లైన్ పేమెంట్లవిధానం ద్వారా అమ్మకాలు సాగేలా ప్రోత్సహించాలని సూచించారు. లూజు విక్రయాలు కానీ, దుకాణాల్లో కల్తీకి ప్రయత్నించినా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. నేత కార్మికుల కోటా కింద చోడవరం సర్కిల్‌లో మరో 3 మద్యం దుకాణాలు రానున్నాయని, ప్రస్తుతం ఉన్న 22 దుకాణాలకు ఇవి అదనంగా ఉంటాయన్నారు. ఇవి ఎక్కడ ఏర్పాటు చేసేది ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందన్నారు. బెల్టు దుకాణాలకు వేలం పాటలు నిర్వహిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. గ్రామాల్లో సారా విక్రయాల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గురు యాక్ట్ కింద సారా కేసులు లిక్కర్ కేసులునమోదైన 98మందిపై మళ్లీ 98మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. బెల్లం వ్యాపారులు,క్రషర్ల యజమానులకు నోటీసులు ఇస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి కేసుల్లో నాన్ బెయిలబుల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీరిలో ఇతరరాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకుని కోర్టు ఎదుట హాజరుపరిచేందుకు ప్రత్యేక టీంలు పంపిస్తున్నట్టు తెలిపారు.

రూ. 11.16 కోట్ల మద్యం అమ్మకాలు

మద్యం దుకాణాలు ప్రారంభమైన తరువాత నవంబరులో సర్కిల్ పరిధిలోని 22 మద్యం దుకాణాలలో 11. 16 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయని సీఐ కేవీపీ నాయుడు వివరించారు. ఈ సమావేశంలో ఎస్ ఐ ఎం. శేఖరం పాల్గొన్నారు.

వరి పనలపై ఉప్పు నీరు పిచికారీ చేయండి

» వ్యవసాయాధికారి మాధురి



చినపాచిలలో వర్షానికి తడిచిన వరిని ఏవోకు చూపుతున్న రైతు

రావికమతం డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం తగ్గినందున వరి రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఏవో మాధురి తెలిపారు. చినపాచిల, మత్స్యపురం గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షానికి తడిచిన వరి పనలను రైతులు ఆమెకు చూపారు. రెల్లరాల్బు పురుగు ఆశించి కొంత నష్టం వాటిల్లితే తుఫాన్‌కు మరింత నష్టం వాటిల్లుతుందని రైతులు సాసుబిల్లి జగ్గారావు, సత్యారావు, కరెడ్ల అప్పారావు, నక్కా పైడిబాబు తదితరులు వాపోయారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం తడిచిన వరి పనలపై లీటర్ నీటికి ఐదు గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేసుకోవాలని ఆమె సూచించారు.

కె.కోటపాడు : వర్షాలకు వరి సాగు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుఫాన్ హెచ్చరికలతో చాలా మంది రైతులు కుప్పలు వేసుకున్నారు. మరికొందరు కోతలు పూర్తయిన రైతులు పనలను పొలాల్లోనే వదిలేశారు. దీంతో వర్షాలకు ఇవి తడిసిపోతున్నాయి. కోతలు పూర్తికాని పొలాల్లో వరి నేలకు వాలిపోయింది. చేలకు రెక్క దించే పురుగు సోకడంతో పొలాల్లోనే వరి కంకులు రాలిపోయి నష్టపోతున్నట్టు తెలిపారు.

మాడుగుల రూరల్: తుఫాన్ ప్రభావతంతో గత మూడు రోజులుగా ముసురు వర్షం పడుతూనే ఉంది. సోమవారం ఉదయం నుంచి తేలికపాటి జల్లులతో వర్షం పడింది. ఇప్పటికే చాలా చోట్ల కోసిన వరి పనలు తడిచిపోయాయి. ఇంకొన్ని చోట్ల వరిపైరు నేలకొరిగింది.

నోటరీ లేకుండా పీవీటీజీ జనన ధ్రువపత్రాలివ్వాలి



జనన ధ్రువ పత్రాలు మంజూరు చేయాలని , ధర్నా చేస్తున్న ఆదివాసీలు

రావికమతం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): నోటరీ విధానం లేకుండా పీవీటీజీ కొందు ఆదివాసీల పిల్లలకు జనన ధ్రువపత్రాలు మంజూరు చేయాలన్న డిమాండ్‌తో సోమవారం చీమలపాడు పంచాయతీ ఆదివాసీలు కల్యాణపులోవలో ధర్నా చేశారు. వర్షం పడుతుతూ, గొడుగుల నీడలో పీవీటీజీ సంఘ నాయకులు గెమ్మిలి వాసు ఆధ్వర్యంలో ఈ నిరసన కొనసాగింది. చీమలపాడు పంచాయతీ శివారు నేరేడుబంద, జీలుగులోవ, కల్యాణపులోవ, రాయిపాడు, అజయ్‌పురం గ్రామాల ఆదివాసీ గిరిజనులు ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకూ ఆందోళన కొనసాగించారు. ఈసందర్భంగా వాసు మాట్లాడుతూ, చీమలపాడు పంచాయతీలో పీవీటీజీ కొందు గిరిజన పిల్లలు 35 మంది జనన ధ్రువపత్రాలు లేక అపార్ యాప్‌లో నమోదు కాలేదన్నారు. సచివాలయానికి వెళ్తే నోటరీ తప్పనిసరిగా ఉండాలని దరఖాస్తులను తిరస్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు,గిరిజన సంఘ నాయకులు కిలో సూరిబాబు, కొర్ర మహేశ్, గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డింగ్ రైట్స్‌ను రద్దు చేయాలి



రోలుగుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

రోలుగుంట: జీఓ 596కు విరుద్ధంగా ఇస్తున్న ఫ్రీ హోల్డింగ్ రైట్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మండలంలోని పెదపేటకు చెందిన ఆదివాసీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పీఎస్ అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం జీవో 596 ద్వారా 20 ఏళ్ల కిందట ఇచ్చిన బంజరు పట్టాదారులకు శాశ్వత హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు క్షేత్రస్థాయిలో దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ నాగమ్మకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోసూరి రాజు, కేదారి దేవి, మారా నూకరాజు పాల్గొన్నారు.

నేడు మన్యపురట్ల రోడ్డుకు శంకుస్థాపన

నాతవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈనెల మూడో తేదీన స్పీకర్ అయ్యన్నపాత్రుడు మండలంలోని మన్యపురట్ల రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ తెలిపారు. ఈ రోడ్డును రూ.78 లక్షలతో నిర్మిస్తున్నారని, ఐదు గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

అన్‌రాక్ ఆధీనంలోని 88 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలి

» డీటీకి టీడీపీ నాయకులు వినతిపత్రం



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పైనీయర్ (అన్‌రాక్) కంపెనీ ఆధీనంలో ఉన్న 88 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని రాచపల్లి టీడీపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్‌ను కోరారు. ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైనీయర్ కంపెనీలో భూములు కోల్పోయిన రైతులకు పునరావాస కాలనీ నిమిత్తం తామరం రెవెన్యూలో 150 ఎకరాల ప్రభుత్వ భూమిని తీసుకొందన్నారు. ఇందులో 36 ఎకరాలను 150 మంది నిర్వాసితులకు పట్టాలు ఇచ్చారని, వారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. మిగిలిన భూమిలో 88 ఎకరాల్లో 2,450 రైతులకు పశువుల పాకలకు రెండు సెంట్లు చొప్పున స్థలాలు కేటాయించారన్నారు. ఈ భూమిలోకి రైతులు రాకుండా కంపెనీ సెక్యూరిటీ గార్డులు అడ్డుకుంటున్నారన్నారు. ఈ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని రైతులకు పశువుల పాకల కోసం పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జోగిపాత్రుడు, టీడీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు రొంగల శంకరగిరి, సత్తిబాబు, హరిచంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో రహదారులు అధ్వానం

కృష్ణాదేవిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, నాగాపురం, కొంగసింగి, తదితర గ్రామాల్లో చిరుజల్లులతో అధ్వానంగా తయారయ్యాయి. వర్షాలతో గ్రామాల్లో వీధి రోడ్లు, ప్రధాన రహదారులు బురదగా మారాయి. సోమవారం కృష్ణాదేవిపేట వారపు సంతకు వచ్చిన వినియోగదారులు, చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

'మంగళాపురం' మరమ్మతుకు మంత్రి ఆదేశం

» జనసేన ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజు



మంత్రి నిమ్మల ఆదేశాలను చూపిస్తున్న జనసేన నేతలు

చోడవరం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మూడు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే మంగళాపురం ఆనకట్ట మరమ్మతులు చేపట్టేందుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలు జారీ చేసినట్టు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బుచ్చెయ్యపేట మండలం కుమందానిపేట సమీపంలో మంగళాపురం ఆనకట్ట వరదలకు కొట్టుకపోవడంతో సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను ఇటీవల మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లామన్నారు. దీనిపై స్పందించిన మంత్రి నిమ్మల ఆనకట్ట మరమ్మతులు, అభివృద్ధికి సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టి రైతులకు సాగునీరు అందేలా చూడాలని జలవనరుల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లం రామప్పారావు, కర్రి తమ్మునాయుడు నరవ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలి పాడ్యమి వేడుకలు

దేవరాపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం, పోలి పాడ్యమి నేపథ్యంలో సోమవారం శారదానదిలో స్నానం చేసి పూజలు చేసి అరటి జొరులో ఒత్తులు వెలిగించి కార్తీక దీపం వెలిగించారు. కార్తీక మాసం నెల రోజులు పూజలు చేసిన ప్రతి ఒక్కరూ పోలి పాడ్యమి నదీస్నానాలు చేస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అనంతరం శివాలయాల్లో పూజలు చేశారు.

దేవరాపల్లి: మండలంలోని ములకలాపల్లిలో కార్తీక మాసం సందర్భంగా నెల రోజులపాటు నగర సంకీర్తన చేశారు. రోజూ ఉదయం ఐదు గంటలకు శివ నామస్మరణతో నగర సంకీర్తన చేశారు. గ్రామంలో 20 మందికి పైగా పాల్గొంటున్నారు. సాయి భక్తులు గొర్లె త్రినాధరావు, సామంతుల మంగ, కళావతి, నారాయణమ్మ, బాలన్న ఉన్నారు.

ఆంజనేయ గుడి నిర్మాణానికి రూ.50 వేల విరాళం



విరాళం ఇస్తున్న గుండు సోదరులు

దేవరాపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నిర్మిస్తున్న అభయాంజనేయ ఆలయంలో విగ్రహ నిర్మాణానికి గుండు రాంబాబు సోదరులు రూ.50 వేల విరాళం సోమవారం మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుకు అందించారు. మాలిబాబు, అల్లు అబద్దం తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు

రావికమతం, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత భగవద్గీపై మండలంలోని మేడివాడ, గర్నికం గ్రామాలలో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మార్గ శిర మాసం ప్రారంభం పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయపురం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ ఆచార్యప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ కమిటీ సభ్యులు కె.త్రినాధరావు, బి.అంకమ్మ, కె.రాజు. వి.భవాని, కె.సత్యం, కె.బంగారుతల్లి, కుసుమ, లక్ష్మి పాల్గొన్నారు.

వరి పొలాలు పరిశీలన

చీడికాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు నేలమట్టమైన వరిచేనును సంరక్షించుకునేందుకు మరో ఐదురోజులుపాటు వరికోతలు వాయిదా వేయాలని ఏవో ఎ.కృష్ణవేణి రైతులను కోరారు. సోమవారం ఖండివరం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ కురచా శ్రీవిద్యతో కలిసి అమ్మతల్లినాయుడు పొలంలో పడిపోయిన వరిని ఆమె పరిశీలించారు.

విభిన్న ప్రతిభ!

వైకల్యం వేధిస్తున్నా సత్తా చాటుతున్న దివ్యాంగులు

- చదువు, ఆట పాటల్లో మెరుగైన నైపుణ్యం
- ఆదుకుంటున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరికరాలు
- సామాజిక బాధ్యతగా చేయూతనివ్వడమే ప్రధానం
- వివక్షతో కుంగిపోతున్న వారికి ధైర్యం కల్పించాలి
- నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైకల్యం శరీరానికే తప్ప మనసుకు, ప్రతిభకు కాదన్న విషయాన్ని నిరూపించి చూపిస్తున్నారు ఎంతోమంది విభిన్న ప్రతిభావంతులు. కాసింత సహకారం అందిస్తే సత్తా చాటేందుకు ఎందరో దివ్యాంగులు సిద్ధంగా ఉన్నారు. పుట్టుకతో, ఇతర కారణాలతో వైకల్యాన్ని పొందిన వారికి అండగా నిలిచి, ప్రోత్సహించాల్సిన చోట చాలామంది వివక్షతో మరింత కుంగిపోయేలా చేస్తున్నారు. దీంతో తమలోని ప్రతిభ, ఎదిగే సామర్థ్యం ఉన్నప్పటికీ దీనమైన జీవితాలను వెళ్లదీస్తున్నారు. దివ్యాంగులకు ఆశలు, కోరికలు, లక్ష్యాలు ఉంటాయని, వారిలోని ఆలోచనలను, ఆకాంక్షలను గుర్తించి ప్రోత్సహించి సహకరించాలని నిపుణులు చెబుతున్నారు. దివ్యాంగుల ఇబ్బందులు, సమాజం అందించాల్సిన సహకారంపై అవగాహన కల్పించేందుకు ఏటా డిసెంబరు మూడో తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సమగ్రమైన, స్థిరమైన భవిష్యత్తు కోసం దివ్యాంగులు (వికలాంగులు) నాయకత్వాన్ని పెంచాలనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

సాధారణంగా నాలుగు కేటగిరీలకు చెందిన వారిని దివ్యాంగులుగా పిలుస్తారు. చూపు, ఎముకలు, వినికిడి, మానసిక



సంబంధిత సమస్యలతో బాధపడే వారిని దివ్యాంగులుగా గుర్తిస్తారు. కొందరిలో ఎక్కువ వైకల్యాలు ఉండవచ్చు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 1,32,586 మంది దివ్యాంగులున్నారు. విభజిత జిల్లాలో 18 ఏళ్లు దాటిన విభిన్న ప్రతిభావంతులు 31 వేల మంది ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం నుంచి చేయూత..

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందుతున్నాయి. వివిధ రకాల పెన్షన్లు అంది స్తూ వీరికి అండగా నిలుస్తుండగా, వారికి అవసరమైన పరికరాలను ఉచితంగా అందించి ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ కూడా ఉంది. ఈ జిల్లా కార్యాలయం పెదవాల్తేరులోని రాణి చంద్రమణీదేవి ఆస్పత్రి ప్రాంగణంలో ఉంది. ఏటా వందలాది మందికి వినికిడి పరికరాలు, ట్రైసైకిల్స్, స్టిక్స్ అందిస్తున్నారు. చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు ఇస్తున్నారు. ఉన్నత చదువులకు ఈశాఖ ఆధ్వర్యంలో రుణాలు అందిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం విభిన్న ప్రతిభావంతులపైనే ఉంది.

ఉద్యోగాల్లో రిజర్వేషన్లు..

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వశాఖలో నాలుగు శాతం రిజర్వేషన్లున్నాయి. ఖాళీలను భర్తీ చేసినప్పుడు వీరి కోటా మేరకు పోస్టులను కేటాయిస్తున్నారు. అలాగే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో విభిన్న ప్రతిభావంతులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా లిఫ్ట్, ర్యాంపుల నిర్మాణానికి నిధులు కేటాయించాయి. విభిన్న ప్రతిభావంతులకు ప్రస్తుతం నెలకు రూ.6 వేల నుంచి వైకల్యాన్ని బట్టి రూ.15 వేల వరకు పెన్షన్ అందుతోంది. వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు పెదవాల్తేరు, పెందుర్తిలో వంద సీట్ల సామర్థ్యంతో రెండు బాలురు వసతిగృహాలున్నాయి. బాలికల కోసం ఎండాడ వద్ద రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహిస్తున్నారు. ఐటీఐ, మెటల్ షీట్, కార్పెంటర్, పెయింటర్ వంటి శిక్షణ ఇచ్చేందుకు అనుగుణంగా దివ్యాంగుల కోసం ట్రైనింగ్ కమ్ ప్రొడెక్షన్ సెంటర్‌ను బక్కన్నపాలెంలో ఏర్పాటు చేశారు. ఎన్‌జీవోల ఆధ్వర్యంలో స్పెషల్ స్కూల్స్ నిర్వహిస్తున్నారు. కేజీహెచ్‌లో ఫిజియోథెరపీ సెంటర్ ఉంది. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌డీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో రుణాలు అందిస్తోంది. కాగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా స్టేడియం నిర్మించేందుకు ప్రతిపాదనలున్నాయి.

వివక్ష వద్దు..

విభిన్న ప్రతిభావంతులపై వివక్ష కూడదని ప్రభుత్వాలతోపాటు అన్ని వర్గాలు సూచిస్తున్నాయి. ఇంట్లో నుంచే వీరిపై వివక్ష మొదలవుతోందని, అది తొలగితే వారు అన్నిరంగాల్లో సత్తా చాటుతారని నిపుణులు చెబుతున్నారు. సరైన ప్రోత్సాహం లేకపోవడంతో నేటికీ సమాజంలో ద్వితీయశ్రేణి పౌరులుగానే మిగిలిపోతున్నారని చెబుతున్నారు. విద్యా, ఉద్యోగాల్లో ఇప్పటికీ ఈ వివక్ష కొనసాగుతోందని దానిని దూరం చేసేందుకు యువత మేల్కొనాలని పిలుపునిస్తున్నారు.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

- కలెక్టర్ విజయకృష్ణన్
- హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

అనకాపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేస్తే సత్ఫలితాలు వస్తాయని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. గత వారం రోజుల్లో జరిగిన ప్రగతి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతం చేయాలని, జల్ జీవన్ మిషన్ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, నీటి సరఫరా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి రామస్వామి పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు బహుముఖ వ్యూహం

... 5వ పేజీ తరువాయి

స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రవాణాలో నిందితులుగా ఉంటూ తప్పించుకు తిరుగుతున్న 729 మందిని అరెస్టు చేశామన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన సుమారు 120 గ్యాంగ్‌లను గుర్తించామని, వీరిలో పలువురిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

గంజాయి రవాణాకు సంబంధించి 25 కేసులలో నిందితులకు 10 నుంచి 25 సంవత్సరాల జైలు శిక్ష పడిందని, భవిష్యత్తులో మరిన్ని కేసుల్లో శిక్షలు పడేలా చార్జిషీట్లు పక్కాగా రూపొందిస్తున్నామని డీఐజీ గోపీనాథ్ చెప్పారు. అదేవిధంగా గంజాయి వ్యవహారాలతో సంబంధం ఉన్న 21 మందిపై పీడీ యాక్టు అమలు చేస్తున్నామని వెల్లడించారు. మరో 247 మంది అనుమానితులపై గంజాయి కేసులు (గంజాయి షీట్స్) నమోదుచేయగా, మరొకరిపై రౌడీషీట్ ఓపెన్ చేశామన్నారు. గంజాయితో దొరికే వ్యక్తుల వాహనాలు, ఆస్తులు సీజ్ చేయాలని నిర్ణయించామన్నారు. ఏజెన్సీలో గతంలో పండించిన గంజాయి భారీగా నిల్వ ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఏజెన్సీలో పలు గ్రామాలతోపాటు నర్సీపట్నం నుంచి మాడుగుల వరకూ, అనకాపల్లి, విశాఖ నగర శివారుల్లో కొంతమంది వద్ద నిల్వలు ఉన్నాయని త్వరలో దాడులు చేస్తామని వెల్లడించారు. గంజాయి వినియోగంపై సంకల్పం పేరుతో ప్రారంభించిన కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. రెండు లక్షల మంది విద్యార్థులను, వేలాది మంది ఉద్యోగులను చైతన్యవంతులను చేశామన్నారు. గంజాయి అమ్మకాలు, వినియోగంపై సమాచారం అందించేందుకు 150 చోట్ల బాక్సులు ఏర్పాటుచేశామన్నారు. గంజాయికి దూరంగా ఉండేందుకు 'యుద్ధం' పేరుతో కొత్త కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. ఏజెన్సీ సందర్శనకు వచ్చే పర్యాటకులు గంజాయి రవాణా, వినియోగానికి దూరంగా ఉండాలని డీఐజీ పిలుపునిచ్చారు. పర్యాటక ప్రాంతాల్లోని హోటళ్లు, రిసార్టులలో గంజాయికి వ్యతిరేకంగా పోస్టర్లు అతికించామని వివరించారు.

పాడి రైతుల నిరసన



డెయిరీ గేట్లు తోసుకుంటూ లోనికి వెళుతున్న పాడి రైతులు

- విశాఖ డెయిరీ ఎదుట ఉద్రిక్తత

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాల సేకరణ ధరను పెంచాలని కోరుతూ పాడి రైతులు సోమవారం విశాఖ డెయిరీ ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు నిలువరించినప్పటికీ పాడి రైతులు డెయిరీ గేట్లు తోసుకుని ఎండీ కార్యాలయం వద్దకు వెళ్లి బైఠాయించారు. ఆవు పాల సేకరణ ధరను డెయిరీ యాజమాన్యం తగ్గించడాన్ని నిరసిస్తూ విజయనగరం పాడి రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ పాడి రైతులు సోమవారం విశాఖ నగరంలో గల డెయిరీ మెయిన్‌గేటు ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాల సేకరణ ధరలను పెంచవలసిన యాజమాన్యం అందుకు విరుద్ధంగా తగ్గించడం సిగ్గుచేటన్నారు. డెయిరీని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం సహకార చట్టం పరిధిలోకి తీసుకొని, యాజమాన్యం చేసిన అవినీతిపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. రైతులను, కార్మికులను ఆదుకోవాలన్నారు. సుమారు మూడు గంటలపాటు నిరసన చేపట్టినప్పటికీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మెయిన్ గేటుకు అడ్డుగా ఉన్న పోలీసులను తోసుకుంటూ రైతులు లోపలకు వెళ్లారు. ఎండీ కార్యాలయం ఎదుట బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సౌత్ ఏసీపీ త్రినాథ్ సమస్యను డెయిరీ ఎండీ ఎస్.వి.రమణకు వివరించడంతో ఆయన ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి వారి డిమాండ్లను తెలుసుకున్నారు. డిమాండ్లను డెయిరీ యాజమాన్యంతో పాటు త్వరలో జరగనున్న బోర్డు డైరెక్టర్ల సమావేశం దృష్టికి తీసుకువెళ్లి నెరవేర్చేందుకు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన రైతులు..తమ సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే మరొకసారి డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన ప్రదర్శనలో రైతు సంఘ నాయకులు ముర్రపు సూర్యనారాయణ, బి.రాంబాబు, గొంప కృష్ణ మూర్తి, ఎల్.ఆదినారాయణ, భూలోక నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

169.39 కిలోల గంజాయి పట్టివేత

... 5వ పేజీ తరువాయి

వస్తున్న కారు ఆపకుండా పారిపోవడానికి యత్నింగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న వ్యక్తి కారు నుంచి ఒక్క ఉదుటన దిగి పరారయ్యాడు. కారులో తనిఖీలు చేపట్టగా గంజాయి ప్యాకెట్లు లభించాయి. అనంతరం గంజాయితోపాటు వాహనాలను, నిందితులను పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించారు. గంజాయిని తూకం వేయగా 169.39 కిలోలు వుంది.

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం తోటపర్తి చెక్‌పోస్టు సమీపంలో గంజాయి ప్యాకెట్లను కారులో ఎక్కించారు. వాహనాన్ని హుకుంపేట మండలం మూలగుడ గ్రామానికి చెందిన కొమ్మ సతీశ్ నడుపుతుండగా, పాడేరు మండలం గొందూరు గ్రామానికి చెందిన డిప్పల మహేశ్, వంజంగి గ్రామానికి చెందిన మోతే గిరి బైక్‌పై కారు ముందు ఎస్కార్ట్‌గా వెళుతున్నారు. గంజాయిని గాజువాక ప్రాంతంలోని ఆటోనగర్‌లో ఒక వ్యక్తికి అందించేందుకు తీసుకెళుతున్నట్టు నిందితులు చెప్పారు. గంజాయితోపాటు కారు, బైక్, మూడు సెల్ ఫోన్లు పోలీసులు సీజ్‌చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. గంజాయిని పట్టుకున్న ఎస్ఐ సింహాచలం, సిబ్బంది సీహెచ్ శ్రీనివాసరావు, వెంకటేశ్, నర్సింగ్, రాము, రవికుమార్‌లను డీఎస్పీ అభినందించారు. మీడియా సమావేశంలో వీరితోపాటు సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ దివ్య పాల్గొన్నారు.

గడువులోగా అర్జీలు క్లియర్ చేయాలి

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



అర్జీదారుని సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నదని, అందువల్ల ప్రజలు అందించే అర్జీలకు సంబంధించిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పలు శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ జాహ్నవితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వేగంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అందిన అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదుతోపాటు హెల్ప్‌డెస్క్‌లను కలెక్టర్ పరిశీలించారు. పీజీఆర్ఎస్ ముగిసే సరికి 231 వినతులు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్‌సిన్హా సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం ముగిసే సరికి 34 అర్జీలు అందగా వాటిలో భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు, తదితర వంటివికి సంబంధించినవి అధికంగా వున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనీషారెడ్డి, ఏఎస్పీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైలుకు గ్రీన్‌సిగ్నల్

- తొలి దశకు రాష్ట్ర ప్రభుత్వం ఓకే
- డీపీఆర్‌కు ఆమోదం
- మూడు కారిడార్లు...46.23 కి.మీ.
- రూ.11,498 కోట్ల వ్యయం
- రెండో దశలో 30.67 కి.మీ.,

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్లు నిర్మిస్తారు. రెండో దశలో 30.67 కి.మీ. పొడవున మరో కారిడార్ నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇదే సందర్భంలో గత వైసీపీ ప్రభుత్వం 2023 డిసెంబరు 29న జారీచేసిన 161వ నంబరు జీఓను రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. వైసీపీ ప్రభుత్వం విశాఖలో లైట్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రతిపాదనలు రూపొందించింది. అందులో 76.9 కి.మీ. పొడవున నాలుగు కారిడార్లను రూ.14,309 కోట్లతో నిర్మిస్తామని ప్రతిపాదించింది. దీనిని వయబులిటీ గ్యాప్ ఫండ్-పీపీపీ విధానంలో కేంద్ర ప్రభుత్వం నుంచి 40 శాతం తీసుకొని, మిగిలిన 60 శాతం ప్రైవేటు డెవలపర్ల నుంచి సమీకరిస్తామని అప్పుడు వెల్లడించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఒకేసారి నాలుగు కారిడార్లు



కాకుండా మొదట మూడు కారిడార్లు, ఆ తరువాత మిగిలిన నాలుగో కారిడార్ నిర్మించాలని కొత్త డీపీఆర్ తయారుచేసింది. ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం మొత్తం కేంద్రం నుంచే రాబట్టాలని ప్రయత్నం చేస్తోంది. కోల్‌కతాలో మెట్రో రైలు ప్రాజెక్టుకు కేంద్రమే పూర్తిగా నిధులు అందించిందని, అదే విధానంలో విశాఖ మెట్రోకు సాయం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణ ఇటీవల ఢిల్లీ వెళ్లి అక్కడి పెద్దలను కోరారు.

తొలి దశలో..

మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశలో స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు 34.4 కి.మీ.తో మొదటి కారిడార్, గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.08 కి.మీ. పొడవున రెండో కారిడార్, తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకూ 6.75 కి.మీ. పొడవున మూడో కారిడార్ నిర్మిస్తారు. దీనికి అవసరమైన భూమి ధర కాకుండా రూ.11,498 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ మూడు కారిడార్లకు 99.75 ఎకరాలు అవసరమని, అందుకు మరో రూ.882 కోట్లు అవసరమని అధికారులు లెక్కగట్టారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 30.67 కి.మీ. పొడవున నాలుగో కారిడార్ నిర్మిస్తారు. దీనికి రూ.5,734 కోట్లు అవసరం. సుమారు 6.13 ఎకరాల భూమి అవసరమని, దానికి రూ.23 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

ఆర్ఈసీఎస్‌పై నేతల కన్ను

... 5వ పేజీ తరువాయి

మాత్రం సదరు నేతలు అసెంబ్లీలో వెల్లడించలేదు. ఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకున్న తరువాత 2023వ సంవత్సరంలో విద్యుత్ సరఫరా, బిల్లుల వసూళ్లు, ఖర్చులు, లాభం చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. అవే వనరులు, అదే ఉద్యోగులతో ఈపీడీసీఎల్ ఆర్ఈసీఎస్‌ను నడుపుతోంది. 2023 జనవరి నుంచి డిసెంబరు నెలాఖరు వరకు రూ.161.52 కోట్లు బిల్లుల రూపంలో వసూలైంది. అంటే నెలకు రూ.12 కోట్లపైనే వచ్చింది. ఆ ఏడాది వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.4.46 కోట్లు చెల్లించింది. ఉద్యోగులకు జీతాలు, చిల్లర ఖర్చులకు రూ.29.37 కోట్లు అయ్యాయి. దీంతో రూ.127.68 కోట్లు మిగిలింది. గతంలో ఆర్ఈసీఎస్‌కు ఈపీడీసీఎల్ సరఫరా చేసిన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.1.40 మాత్రమే వసూలు చేసేది. 2023లో ఆర్ఈసీఎస్‌కు సుమారు 30 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. దానికి ఆ రేటు ప్రకారం చూసుకుంటే రూ.42 కోట్ల వరకు బిల్లింగ్ చేయాల్సి ఉంటుంది. ఆ మొత్తం కూడా మినహాయిస్తే నికరంగా 2023లో రూ.85.68 కోట్లు మిగిలినట్టు. అవే ఏర్పాట్లు, అదే సిబ్బంది, అదే బిల్లింగ్...లెక్కలు మాత్రం వేరు. నాడు ఆర్ఈసీఎస్ చూపించిన ఖర్చులు వేరు. ఇప్పుడు అయిన ఖర్చులు వేరు. అదే తేడా. అనకాపల్లి నేతలు అసెంబ్లీలో రెండేళ్ల లాభం లెక్కలు చూపించారు. ఒక్క ఏడాది కూడా రూ.2 కోట్లు లేదు. కానీ ఈపీడీసీఎల్ నుంచి సమాచార హక్కు చట్టం కింద సేకరించిన వివరాల ప్రకారం ఒక్క 2023లోనే రూ.85.68 కోట్లు మిగిలాయి.

యూనిట్‌కు రూ.3.6 మిగులు

ఈపీడీసీఎల్ నుంచి యూనిట్ రూ.1.40 చొప్పున తీసుకుని సగటున రూ.5 చొప్పున అమ్ముకుంటున్నారు. అంటే యూనిట్‌కు రూ.3.6 మిగులుతోంది. సొసైటీ కాబట్టి దీనిని సభ్యులకు డివిడెండ్ రూపంలో పంచాలి. కానీ రూ.2 కోట్ల కంటే తక్కువ లాభం చూపించి, మిగిలిన మొత్తం అంతా రకరకాల ఖర్చుల పేర్లతో సొసైటీ అధికారులు, ఆ ప్రాంత నాయకులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఈసీఎస్ చేజారిపోకుండా గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు చేయని ప్రయత్నం లేదు. ప్రభుత్వం నుంచి సిఫారసు లేఖ ఇప్పించారు. కొంతమంది వద్ద రూ.లక్షలు తీసుకుని ఉద్యోగులుగా నియమించారనే ఆరోపణలు కూడా వచ్చాయి. అధికారంలో ఎవరు ఉన్నా ఆర్ఈసీఎస్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఈపీడీసీఎల్ నుంచి వెనక్కి తీసుకుని లైసెన్స్ ఇప్పించాలని కొందరు కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీనికి ఉత్తరాంధ్రకు చెందిన ఒక కీలక నేత సహకారం అందిస్తున్నట్టు చెబుతున్నారు.

క్రైం... crime news

ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పై మండలంలోని షేకిళ్లపాలెం జంక్షన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఎలమంచిలికి చెందిన కందికొండ శ్రీను అనే వ్యక్తి సోమవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో అనకాపల్లి నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. షేకిళ్లపాలెం వద్ద నడిచివెళుతున్న గుర్తుతెలియని వ్యక్తిని ద్విచక్ర వాహనం బలంగా ఢీకొన్నది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ హైవే పెట్రోలింగ్ పోలీసులు ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందగా, కందికొండ శ్రీనుకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. మృతిచెందిన వ్యక్తి వయసు సుమారు 50 ఏళ్లు వుంటాయని, మృతదేహాన్ని ఎలమంచిలి ఆస్పత్రి మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా కేసులో మరో నిందితుడిని సోమవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. గత ఏడాది ఆగస్టు 22వ తేదీన కారులో 280 కిలోల గంజాయిని తరలిస్తుండగా డ్రైవర్‌ను అరెస్టు చేసి కారును సీజ్ చేశామన్నారు. ఈ కేసులో రోలుగుంట మండలం బెన్నభూపాలపట్నం గ్రామానికి చెందిన అట్టా రమణబాబును సోమవారం అరెస్టు చేసినట్టు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మృతి

పాయకరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్డులో ఇటీవల విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... స్థానిక పాత పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న భవనం పైఅంతస్తులు గంటా రామచంద్రరావు కుటుంబంతో నివాసం వుంటున్నాడు. గత నెల 23వ తేదీ రాత్రి ఇంట్లోని చెత్తను కిందకు పడవేసే క్రమంలో సమీపంలో వున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌తోపాటు మంటల చెలరేగడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కాకినాడ తరలించారు. అక్కడ ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు.

7న ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనాన్ని ఈ నెల ఏడో తేదీన నిర్వహిస్తున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టీ గ్రూపు ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణ, విశిష్ట అతిథిగా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారన్నారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఎంపీ ఎం.శ్రీభరత్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

నృసింహ దీక్ష ప్రారంభం

సింహాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ప్రధాన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవి రమణాచార్యులు సారధ్యంలో చందన మాలలను భక్తులతో కలిసి మాడవీధిలో ప్రదక్షిణంగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. వేద పండితులు మంత్రోచ్చారణలు చేస్తుండగా షోడశోపచారాల పూజలు చేసిన అనంతరం ఏఈఓ ఆనందకుమార్ భక్తులకు తొలిమాల వేసి దీక్షలకు శ్రీకారం చుట్టారు.

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

... 5వ పేజీ తరువాయి

కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళ్లలేకపోయారు. సోమవారం డోలీలో మోసుకుంటూ దారిలో గెడ్డ దాటుకుని సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోని చింతలపూడి బ్రిడ్జి వరకు వచ్చారు. అక్కడ నుంచి 108 అంబులెన్స్‌లో దేవరాపల్లి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. మధ్యాహ్నం వరకు ఇక్కడ వుంచినప్పటికీ ప్రసవం కాకపోవడంతోపాటు వైద్య నిపుణులు లేకపోవడంతో కె.కోటపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో సాధారణ ప్రసవం జరిగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	605
విజయనగరం	609
శ్రీకాకుళం	609